



బాపట్ల రూరల్‌లో ముంపులోనే వరిపైరు

ఆక్రమణలో.. ఆనవాళ్లు

- ఘనకీర్తికి మారుపేరుగా మందడం, మల్కాపురం
- సజీవ శిలాజాలుగా శివాలయం, నందిశాసనం, కోనేరు
- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రజల వేడుకోలు



గణపతిదేవుని ఆధ్వర్యంలో విశ్వేశ్వర శంభు నిర్మించిన శివాలయం

శౌర్యానికి.. ధైర్యానికి ప్రతీకగా నిలిచే రాణి రుద్రమదేవి అంటే నేటికీ తెలుగునాట ఘనకీర్తి. రాజధాని అమరావతితో కాకతీయుల రాణికి ప్రత్యేక అనుబంధం ఉంది. అమరావతి భూభాగంలో ఆమె ఎన్నోసార్లు నడయాడారు. కాకతీయ సామ్రాజ్యం పాలనా పగ్గాలను చేపట్టడానికి ముందునుంచే రుద్రమదేవి తండ్రి గణపతి దేవునితో కలిసి తరచుగా మల్కాపురం వచ్చిపోతుం డేవారు. ఈ ప్రాంతంలోని ఓ కొలనంటే ఆమెకు ఎంతో మక్కువ. ఆ కొలను ఒడ్డున కూర్చొని సేదతీరేవారు. ఈ ప్రాంతంపై తనకున్న ప్రేమాభిమానాల కొద్దీ ఆమె తన జన్మదినోత్సవాన్ని ఇక్కడే ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఇక్కడి మహిళల గర్భకోశ వ్యాధుల చికి త్సల కోసం ఏకంగా ఓ ప్రసూతి వైద్యశాలనే ఆమె కట్టిం చారు. రాణీ రుద్రమదేవిని అంతగా ఆకట్టుకున్న ఆ ప్రదేశమే నేటి మల్కాపురం. రుద్రమదేవి తాలూకు ఆనవాళ్లు ఇప్పటికీ అక్కడ కనిపిస్తూనే ఉన్నాయి. అయితే ఆ ఆనవాళ్లు నేడు ఆక్రమణలకు గురయ్యాయి. వీటిని పట్టించుకునేవారు లేరు. ఘన చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న ఈ ప్రాంతాన్ని రాష్ట్రప్రభుత్వం గుర్తించి, రుద్రమదేవి తాలూకు ఆనవాళ్లను పరిరక్షించి దీనినో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అమరావతిలో రుద్రమదేవి గుర్తులు శిథిలం

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

రుద్రమదేవి చరిత్ర తెలంగాణకే కాదు.. యావత్ తెలుగుప్రాంతానికంతా సుపరిచితమే. వరంగల్ కేంద్రంగా ఆమె పాలన కొనసాగినప్పటికీ నేటి రాజధాని అమరావతి ప్రాంతం కూడా అప్పట్లో ఆమె ఏలుబడిలోనిదే. రుద్రమదేవి తండ్రి గణపతిదేవుని కాలం నుంచే ఈ ప్రాంతంలో కాకతీయులకు అనుబంధం ఉండేది. తనకు రాజగురువుగా కొనసాగిన విశ్వేశ్వర శంభు అనే శివాచార్యునికి ఈ ప్రాంతాన్ని బహుమతిగా ఇచ్చారు గణపతిదేవుడు. రాయపూడి మొదలు పెనుమాక వరకు ఉన్న పదికిపైగా గ్రామాలను ఈ విశ్వేశ్వరశంభుకు అప్పగించారు. నాలుగు గొప్ప రాజవంశాలకు రాజగురువుగా వ్యవహరించారు. కృష్ణానది ఉత్తరవాహినిగా ఉన్న ఈ ప్రాంతాన్ని కాకతీయ చక్రవర్తి విశ్వేశ్వరశంభుకు అప్పగించారు. మల్కాపురంలో విశ్వేశ్వరశంభు గోళకీమఠాన్ని స్థాపించారు. గోళకీ మఠం అంటే శివాలయం. వేదవిద్యతో కూడిన మహా విద్యాలయ సముదాయం. అప్పట్లో ఈ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల సందర్భంగా పదిమంది నృత్యకళాకారిణులు నాట్యం చేస్తుండేవారు. 14 మంది మహిళా గాయకురాండ్రు, వివిధ రకాల వాయిద్యాలను వాయిస్తూ మరో 16 మంది సంగీత కళాకారులు ఉండేవారు.. అర్చనల నిమిత్తం ఆరుగురు, ఆలయ నైవేద్యాల కోసం మరో ఇద్దరు బ్రాహ్మణులు ప్రత్యేకంగా ఉండేవారు. వీరభద్రుల పేరిట పది గ్రామాలను సంరక్షించడానికి 73 మందితో కూడిన ప్రత్యేక సైనికదళం

(మిగతా 7లో)



మల్కాపురంలో రాయ గజకేసరి రాణీ రుద్రమదేవి వేయించిన శిలాశాసనం

ఘనంగా రుద్రమా జయంత్యుత్సవం

1261 మార్చి 25న రుద్రమదేవి తన జన్మదినోత్సవాన్ని మల్కాపురంలోని గోళకీమఠంలో ఎంతో వైభవంగా జరుపుకున్నారు. ఆ సందర్భంగా శివాలయానికి తూర్పు దిక్కుగా ఓ భారీ శిలాశాసనాన్ని వేయించారు. అది ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. దీనిని నంది శాసనమమని, నాగశాసనమని వ్యవహరిస్తుంటారు. ఈ శాసనంపై ఆలయం వైపు నంది విగ్రహం.. మరోవైపు పడగవిప్పి సర్పం చెక్కబడి ఉండటమే ఇందుకు కారణం. దీనిపై నాటి జయంత్యుత్సవాల నిర్వహణ, చేసిన దానాల గురించి విపులంగా తెలుగు, సంస్కృత భాషల్లో లిఖించారు. ఈ సందర్భంలోనే రుద్రమదేవి ఆలయానికి తూర్పు ఈశాన్యంగా ఓ కోనేరును తవ్వించడంతోపాటు మందడం పరిధిలో ఓ ప్రసూతి వైద్యశాలను ఏర్పాటు చేయించారు. అప్పట్లో గర్భిణులు సుఖప్రసవాలు లేక మృత్యువాత పడుతుండడాన్ని చూసి రుద్రమదేవి ఎంతగానో చలించిపోయి ఈ ప్రసూతి వైద్యశాలను అన్ని సదుపాయాలతో ఏర్పాటుచేయించారు. ఈ ప్రస్తావన కూడా ఆ శాసనంలో ఉంది. తాను సామ్రాజ్ఞిగా పట్టాభిషక్తురాలైన తర్వాత కూడా రుద్రమదేవి ఇక్కడికి ఎన్నోమార్లు వచ్చారు. తాను నిర్మించిన కోనేరు ఒడ్డున కూర్చొని సేదతీరుతుండడం ఆమెకు ఇష్టమైన అలవాటుగా ఉండేదంటారు. 1289లో జరిగిన ఓ మహాసంగ్రా మంలో రుద్రమదేవి వీరమరణం పొందిన తర్వాత కూడా చాలాకాలం ఈ ప్రాంతం గొప్పగానే వెలుగొందుతూ వచ్చింది.

నష్టం అపారం

- ప్రభుత్వానికి నివేదికలు
- 84,500 ఎకరాల్లో పంటలు మునక
- 152 కిలోమీటర్ల మేర రహదారులు ఛిద్రం
- విద్యుత్ శాఖకు రూ.3 కోట్ల వరకు నష్టం
- మళ్లీ భయపెడుతున్న వర్షం హెచ్చరికలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ మిగిల్చిన నష్టం అంచనాల విషయంలో యంత్రాంగం ఓ అంచనాకు వచ్చింది. జిల్లావ్యాప్తంగా 84,500 ఎకరాల్లో పంటలు ముంపు బారిన పడినట్లు వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఇందులో వరి విస్తీర్ణం 68,000 ఎకరాలు ఉండగా, మినుము 4,600, మొక్కజొన్న 3,600 ఎకరాలు ప్రధానంగా ఉన్నాయి. 1100 స్తంభాలు నేలకొరిగాయని, 200 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని వీటికి సంబంధించి రూ.3 కోట్ల వరకు నష్టం విద్యుత్‌శాఖకు వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. 152 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతినగా ఆ నష్టం రూ.2 కోట్లు ఉండవచ్చని అధికారులు తెలిపారు. 416 చెట్లు నేలకొరగగా, ప్రధాన వాగులన్నింటికీ గండ్లు పడ్డాయి. వీటికి మరో రూ.15 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు యంత్రాంగం ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించింది.

నష్టపోయిన వారందరికీ..

సోమవారంతో నష్టం వివరాల తుది జాబితాను ఎయిమ్స్‌లో అధికారులు నిక్షిప్తం చేయనున్నారు. దీనికి తోడు మాన్యువల్‌గా కూడా అవకాశం ఇవ్వాలనే నిర్ణ యానికి ప్రభుత్వం యంత్రాంగం వచ్చిం ది. ఈ-క్రాప్‌లో నమోదు కాకుండా ముంపుబారిన పడిన పంటలను మాన్యువల్‌గా జాబితా తయారు చేయాలనేదే ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఇందుకు సంబంధించి అధికారిక ఆదేశాలు వెలువడాల్సి ఉందని వ్యవసాయశాఖ చెబుతోంది. వీటిని క్రోడీకరించి ఈ వారం చివరికి అర్హులైన వారి జాబితాను ఆర్‌ఎస్‌కేలలో ప్రదర్శించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తదుపరి అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితా విడుదల చేసేలా వ్యవసాయశాఖ అడుగులేస్తోంది.

మళ్లీ వర్షం హెచ్చరికలు...

అల్పపీడన ప్రభావంతో ఈ నెల 4, 5 తేదీల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణశాఖ హెచ్చరికలు రైతులను కలవరపెడుతున్నాయి. ఆదివారం బాపట్లలో చిరుజల్లులు కురవగా, పిట్టలవానిపాలెం మండలంలో ఓ మోస్తరు వర్షం పడింది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. నాలుగు రోజులుగా పొలాల్లో వర్షపు నీరు నిలిచే ఉందని, అవి బయటకు పోవడానికి మరో రెండు రోజులు పడుతుందని మళ్లీ వర్షాలు అంటే పంటలపై ఆశలు వదిలేసుకోవడమేనని రైతులు వాపోతున్నారు.

బీచ్‌లు.. బంద్

- కార్తీక స్నానాలకు అనుమతి నిరాకరణ
- నిరాశతో వెనుతిరిగిన పర్యాటకులు

బాపట్ల, వాడరేవు(చీరాల), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ ప్రభావంతో సముద్ర తీరం ప్రమాదకరంగా మారిందని బీచ్‌లను మూసేశారు. తుఫాన్ కల్లోలం కారణంగా తీరమంతా గుంతలతో నిండిపోయాయి. దీంతో సూర్యలంక, వాడరేవు, రామాపురం తీరంలో పరిస్థితి ప్రమాదక రంగా ఉంది. అయితే కార్తీక



సూర్యలంక బీచ్‌కు పర్యాటకులు రాకుండా మూసివేసిన గేటు

మాసం పైగా ఆదివారం కావటంతో సముద్రతీరానికి ఉదయం నుంచి పెద్దఎత్తున భక్తులు, పర్యాటకులు తరలివచ్చారు. సుదూర ప్రాంతాలు నుంచి సముద్ర స్నానాల కోసం ప్రత్యేక వాహనాల్లో కుటుంబసమేతంగా వచ్చినవారిని పోలీసులు సముద్రంలోకి అనుమతించలేదు. బయట నుంచి బయటే వారిని వెనక్కి పంపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో వారంతా నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది. మరో రెండురోజులు తీరానికి పర్యాటకుల అనుమతి ఉండదని అధికారులు ప్రకటించారు. అయితే 5వ తేదీ కార్తీక పౌర్ణమిరోజైనా అనుమతిస్తారా అంటూ పర్యాటకులు, భక్తులు ప్రశ్నించగా వారి నుంచి స్పష్టత లేదు. సూర్యలంక సముద్రతీరానికి సోమ,మంగళవారాల్లో పర్యాటకులకు, భక్తులకు అనుమతి లేదని ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. వాతావరణం అనుకూలించకపోవడంతో మత్స్య, రెవెన్యూశాఖల ఆదేశాల మేరకు బీచ్‌లను మూసేసినట్లు డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. వాతావరణంలో మార్పులు అనుకూలంగా వచ్చిన తర్వాత బీచ్‌ల్లోకి అనుమతిస్తామని, ఇందుకు పర్యాటకులు, భక్తులు సహకరించాలని కోరారు. కాగా చీరాల వాడరేవు, రామాపురంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ ఎండీ మొయిన్ పర్యటించి సముద్ర స్నానాలకు పర్యాటకులకు అనుమతి లేదని తెలిపారు. వీరి వెంట ఫిషరీస్ ఏడీ ఇంకోలు ధనలక్ష్మి, డీపీవో ప్రభాకరరావు, తహసీల్దార్ గోపీకృష్ణ తదితరులు ఉన్నారు.

కూలిన వంతెనలు, చప్టా

- రాకపోకలు బంద్.. ప్రజలు ఇక్కట్లు



వాడరేవు - రామాపురం మార్గంలో కూలిన వంతెన



కెపాల్ గెస్ట్‌హౌస్ సమీపంలో కోతకు గురైన చప్టా

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ధాటికి వంతెనలు, చప్టాలు ధ్వంసమయ్యాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాలు పోయేందుకు వీలు లేకుండా వంతెనలు, చప్టాలు కూలిపోయాయి. వాడరేవు జీరో పాయింట్ వద్ద చప్టా సగభాగం కూలి ప్రమాద భరితంగా ఉంది. మిగిలిన మూడు వంతెనలు దారుణంగా కుప్పకూలాయి. దీంతో సుమారు ఐదు రోజుల నుంచి వాడరేవు - రామాపురం గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. మనుగడకు సంబంధించి రాకపోకలు జరగక పోవడంతో వాడరేవు, రామాపురం వాసులు ఇబ్బంది పడుతున్నారు. కూలిన వంతెనలు, చప్టాల మరమ్మతులపై అధికారుల నుంచి స్పందనలేదు. కూలిన వంతెనల సమీపంలో ప్రమాదాలు జరగకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను అడ్డుకుంటున్నారు. ఇక ఈ మార్గంలో 40 వరకు రిసార్ట్స్ ఉన్నాయి. ఇప్పటికే పర్యాటకులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని ఉన్నారు. అయితే రాకపోకలకు అవకాశం లేకపోవడంతో వారంతా తమ పర్యటనలను రద్దు చేసుకున్నారు. తీరం సాధారణ స్థితికి చేరినా వంతెనల నిర్వహణ లేకపోతే పర్యాటకం ప్రశ్నార్థకంగా మారనున్నది. ఈ నేపథ్యంలో వంతెనలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సత్‌క్రియల ద్వారానే మోక్షం

గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

4 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న సాగర్ నీరు



7

నగరవనంలో.. దొంగలు

- సుందరీకరణ పనుల్లో అక్రమాలు
- అటవీ అధికారుల కనుసన్నల్లోనే అక్రమాలు
- తాజాగా ఏసీబీకి చిక్కిన రేపల్లె రేంజ్ అధికారి

(బాపట్ల,ఆంధ్రజ్యోతి)

దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లుగా బాపట్ల పరిధిలోని నగరవనం సుందరీకరణ పనుల తీరు ఉంది. పనులు అప్పగించడం మొదలుకుని బిల్లులు చెల్లించడం వరకు అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనే. కీలకంగా ఉండాల్సిన వనసంరక్షణ కమిటీ (వీఎస్‌ఎస్)లను కేవలం కాగితాలకే పరిమితం చేసి పనులు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొంతమంది బినామీలతో అధికారులు పనులు చేయించి సుందరీకరణ నిధులను దోచుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యత కోసం నగరవనాలు ఏర్పాటు చేయాలని 2023లో కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలో బాపట్ల మండల పరిధిలోని ఆదర్శనగర సమీపంలో అటవీశాఖకు చెందిన భూమిని ఎంపిక చేసి రూ.2 కోట్లతో నగరవనం పేరిట సుందరీకరణ చేపట్టారు. అయితే నగరవనం పనులను వీవీఎస్ కమిటీల ద్వారానే జరగాలి. కానీ పనుల విషయంలో వీఎస్‌ఎస్‌ల పాత్రను నామమాత్రం చేస్తూ అటవీశాఖ అధికారులు అన్నీ తామై నిధులను దోచేసినట్లు తెలుస్తోంది.

తాజా ఘటనతో అనేక సందేహాలు..

రూ.2 కోట్ల పనులకు సంబంధించి రూ.1.40 కోట్ల పనులను 2024 ఆరంభానికే పూర్తి చేయగా అప్పట్లోనే బిల్లులు మంజూరయ్యాయి. మిగిలిన రూ.60 లక్షల పనులను తాజాగా పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి రూ.5.90 లక్షల బిల్లులకు ఆమోదం తెలపడానికి రేపల్లె రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ రమణారావు రూ.1.25 లక్షలు తీసుకుంటుండగానే ఏసీబీ వల పన్ని నగరవనంలోనే అదుపులోకి తీసుకుంది. ఏసీబీకి పట్టించిన కాంట్రాక్టర్ కర్రి వీర్లంకయ్యతో రమణారావుకు ఏళ్ల తరబడి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎఫ్‌ఆర్‌వో వాహనం డ్రైవర్‌గా కూడా సదరు కాంట్రాక్టర్ కొన్ని రోజులు పనిచేశారనేది సమాచారం. వీఎస్‌ఎస్ తీర్మానాలతో పాటు పనుల పురోగతిలో వారి పర్యవేక్షణ, చివరికి బిల్లుల ఆమోదం, సదరు డబ్బులు కూడా వారి ఖాతాల్లోనే జమ చేయాలనే నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఇవేవీ క్షేత్రస్థాయిలో కనబడలేదు. ఈ ఎపిసోడ్‌లో రేంజ్ ఆఫీసర్ పాత్ర కీలకం కాగా అప్పుడు పనిచేసిన కీలక అధికారులకు కూడా ముడుపులు భారీగానే అందినట్లు సమాచారం. అటవీశాఖ కీలక అధికారులకు గతంలో ముడుపులు అందడం వల్లే వీఎస్‌ఎస్‌లను డమ్మీ చేసి తంతు నడిపించారని సమాచారం. గతంలో కూడా భారీగా అధికారులకు లంచాలు ఇచ్చానని పనులు చేసిన కాంట్రాక్టర్ చెబుతున్నారు. మొత్తం రెండు కోట్ల పనుల్లో దాదాపు రూ.40 లక్షలు పక్కదారి పట్టినట్లు కనబడుతోంది. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపితే విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

కమనీయం.. సహస్ర దీపాలంకరణ



దేవాలయ ప్రాంగణంలో మహిళలు వెలిగించిన కార్తీక దీపాలు

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లోని శ్రీరుక్మిణి సమేత పాండురంగాస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి సహస్రదీపాలంకరణ సేవ జరిగింది. భక్తిశ్రద్ధలతో పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గంటా సాయిబాబు, కృష్ణకుమారి దంపతులు దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆ వెలుగుల్లో ఆలయం వెలుగులీనింది. ఆ దృశ్యాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యం పొందారు. అనంతరం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త మార్పూరి బద్రినారాయణ, అర్చకులు మేడూరి వెంకటఅప్పలచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకూ.. ఆటలు

- 22 నుంచి డివిజన్ స్థాయిలో పోటీలు
- సన్నాహాలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ



రేపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించి వారిని ప్రోత్సహించి భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషించే ఉపాధ్యాయుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసేలా.. మరింత ఉత్సాహంగా బోధన చేసేలా.. శారీరక, మానసిక సామర్థ్యం పెరిగేలా.. ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ డైరె క్టర్ విజయరామరాజు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్ పాఠశా లలో దాదాపు 18 వేల మందికిపైగా ఉపాధ్యా యులు పనిచేస్తున్నారు. విద్యారంగంలో విప్ల వాత్మక మార్పులు తీసుకువస్తామని ప్రకటిం చిన నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో కూడా అంత ర్లీనంగా ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేం దుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. క్రికెట్, త్రో బాల్, కబడ్డీ, క్యారమ్స్, షటిల్ తదితర పోటీలు తొలుత మండల స్థాయిలో నిర్వహించ నున్నారు. ఆ తర్వాత డివిజన్ స్థాయిలో నిర్వ హించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఈ బాధ్యతలను మండల స్థాయిలో స్పోర్ట్స్ కోఆర్డినే టర్స్‌కు అప్పగించారు. మండలస్థాయిలో ఎంఈఓ 1, 2 నిర్వహణ అధికారులుగా వ్యవహరి స్తారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈవో, జిల్లా స్థాయిలో డీఈవో స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి సమన్వయకర్తలుగా ఉంటారు. రాష్ట్ర స్థాయిలో పోటీలకు స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, జేడీ స్థాయి అధికారి బాధ్యతలు తీసుకుంటారు. పోటీలకు తొలుత మండల స్థాయిలో జట్ల ఎంపికను చేస్తారు. ఉపాధ్యాయులకు సంబంధించి క్రికెట్ పోటీలకు సంబంధించి ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు, పాఠశాల సహాయకులు, నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్, పీఈటీలు, ఏడుగురు ఎస్జీటీల సహా మొత్తం 16 మందితో కమిటీ ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా త్రోబాల్ ఇతర క్రీడలకు ప్రత్యేకంగా జట్ల ఎంపిక నిర్వహిస్తారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి డీఈఓ లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

షెడ్యూల్ ఇలా...

- డివిజన్ స్థాయి : 22, 23 తేదీల్లో
- జిల్లాస్థాయి :, 28, 29, 30 తేదీల్లో
- రాష్ట్రస్థాయి : డిసెంబరు 6, 7, 13, 14

క్యాట్ ఫైనల్ ప్రిపరేషన్

వేగం, కచ్చితత్వం ప్రధానం

ఐఐఎం సహా పేరొందిన మేనేజ్‌మెంట్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్ష క్యాట్(కామన్ అడ్మిషన్ టెస్ట్). ఈ టెస్ట్‌లో సాధించిన పర్సంటైల్‌తో నేరుగా ప్రవేశం లభించదు. అయితే ఆ కాలేజీలు అడ్మిషన్‌కు సంబంధించి పరిగణనలోకి తీసుకునే ప్రాతిపదికల్లో మొదటిది మాత్రం క్యాట్ పర్సంటైల్. తొలిసారి ఈ టెస్ట్ రాసే అభ్యర్థులు ఒకవైపు ఫైనలియర్‌లో చివరి అంకమైన ప్రాజెక్ట్ వర్క్ పనిలో ఉంటారు. మరోపక్క గేట్, క్యాట్ వంటి ప్రవేశ పరీక్షలు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ టెస్టుల బిజీలోనూ ఉంటారు. వీటిలో క్యాట్‌కు పట్టుమని నెల రోజుల గడువు కూడా లేదు. ఈ నేపథ్యంలో క్యాట్ తొలిసారి రాస్తున్నవారికి తోడు ఒకింత అవగాహనతో ముందుకు సాగుతున్న వారి వరకు అభ్యర్థులంతా టెస్ట్‌కు సమర్థంగా సన్నద్ధం కావచ్చు. అందుకు ప్రధానంగా... క్యాట్‌లో అడిగిన అన్ని ప్రశ్నలూ సాల్వ్ చేయాల్సిన అవసరం లేదు. 40 నుంచి 50 శాతం ప్రశ్నలను సాల్వ్ చేయగలిగితే చాలు, మంచి స్కోర్ సాధించవచ్చన్నది నిపుణుల సూచన. క్యాట్‌లో ప్రధానంగా మూడు విభాగాలు - వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ), డేటా ఇంట్రప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(క్యుఎ) ఉంటాయి. ఒక్కో విభాగానికి సంబంధించి ప్రిపరేషన్ ఇలా ఉండేలా చూసుకోవాలి.



క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (క్యుఎ)

- ఈ విభాగంలో వేగం అంతకు మించి కచ్చితత్వం ప్రధానం. ఆ రెంటికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మంచి స్కోర్ సాధించాలి.
- అర్థమెటిక్, ఆల్జీబ్రా, జామెట్రీ, మోడ్రన్ మేథ్స్‌లోని కాన్సెప్ట్‌లను రివైజ్‌చేసుకోవాలి. కాన్సెప్ట్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి.
- ఈ విభాగం సెక్షనల్ మాక్ టెస్టులను వారానికి రెండు లేదా మూడు చొప్పున చేయాలి.
- అన్ని టాపిక్స్‌లో కలిపి ప్రతి రోజూ 30 నుంచి 40 ప్రశ్నలను సాల్వ్ చేయాలి.
- త్వరితగతిని గుర్తుకు తెచ్చుకునేందుకు వీలుగా ఫార్ములా నోట్ బుక్‌ను మెయింటైన్ చేయాలి.
- గతం నిర్వహించిన ప్రశ్నపత్రాల్లో తరచూ అడుగుతున్న ప్రశ్నలను పదేపదే సాల్వ్ చేస్తుండాలి.

డేటా ఇంట్రప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్)

- రోజుకు కనీసం రెండు, మూడు సెక్షనల్ మాక్ టెస్టులను చేయాలి. ప్రతి సారి సాల్వ్ చేయడంలో కష్ట స్థాయిని పెంచుకుంటూ వెళ్ళాలి.
- డేటా టేబుల్స్, లాజికల్ పజిల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి సెట్‌కు టైమ్ సెట్ చేసుకోవాలి. అలా సాల్వింగ్ కోసం పట్టే సమయాన్ని తగ్గించుకోవాలి.
- ప్రతి మాక్ టెస్టులో దొర్లే తప్పులను విశ్లేషించుకోవాలి. సాల్వింగ్ నుంచి ఆలోచన, తుది నిర్ణయం వరకు ప్రతి చోట సాధారణంగా ఎదురవుతున్న తప్పులను ఒక దగ్గర నోట్ చేసుకోవాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- చివరి వారానికల్లా పది, పదిహేను నిమిషాల్లో ప్రతి సెట్‌ను పూర్తి చేయగలగడం అన్నది లక్ష్యంగా పెట్టుకోవాలి. అదే సమయం 80 నుంచి 90 శాతం మేర కచ్చితత్వాన్నీ సాధించాలి.

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ)

- రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడంలో సరైన పాటవానికి తోడు నిలకడ సాధించాలి.
- రోజుకు కనీసం మూడు రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడాన్ని అలవాటు చేసుకోవాలి.
- పారా జంబుల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- మాక్ టెస్టుల్లో అటు ఆ పరీక్ష, ఇటు వ్యక్తిగత ప్రతిభను సునిశితంగా విశ్లేషించుకోవాలి.

రైల్వేలో మెగా రిక్రూట్‌మెంట్

భారతీయ రైల్వే వివిధ పోస్టులకు వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేసింది. టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాలు ఉన్నాయి. వివిధ అర్హతలకు తోడు నిర్దేశిత ఎంపిక ప్రక్రియ ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. సంక్షిప్తంగా ఆ వివరాలు దిగువ ఇస్తున్నాం.



నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (అండర్ గ్రాడ్యుయేట్)

- కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్: **2424**
- అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **394**
- జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **163**
- ట్రైనీ క్లర్క్: **77**

ఖాళీలు 3058

అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 27

నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్)

- కమర్షియల్ కమ్ టికెట్ సూపర్వైజర్: **161**
- స్టేషన్ మాస్టర్: **615**
- గూడ్స్ రైలు మేనేజర్: **3416**
- జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్: **921**
- సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **638**
- ట్రాఫిక్ అసిస్టెంట్: **59**

ఖాళీలు 5810

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులకు ఇంగ్లీష్/హిందీ టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత టెస్ట్(టైర్ 1, టైర్ 2)కు తోడు టైపింగ్ స్కిల్‌టెస్ట్/కంప్యూటర్ ఆధారిత ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 20

ఇంకొన్ని

జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకూ నోటిఫికేషన్ విడుదలైంది.

ఖాళీలు 2569

అర్హత: పోస్టును బట్టి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా/ బీఎస్సీ డిగ్రీ పాసై ఉండాలి.

ఎంపిక: రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, రైల్వే మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 20

డిజైనింగ్ @ ఎన్ఐడి



దుస్తులు, పాదరక్షలు, వాచీ, హ్యాండ్‌బ్యాగ్ సహా ఏదైనా సరే, ఒక వస్తువుకు ఉండాల్సిన సాధారణ లక్షణాలు దెబ్బతినకుండా అందంగా, ఆధునికంగా మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దడాన్నే డిజైనింగ్ అంటాం. ఈ అంశానికి సంబంధించి మన దేశంలో అత్యున్నత శిక్షణ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి) అహ్మదాబాద్. దానికితోడు గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్ ఏర్పాటు చేశారు. తరవాతి రోజుల్లో విజయవాడ (ఆంధ్రప్రదేశ్), కురుక్షేత్ర(హర్యానా), భోపాల్(మధ్యప్రదేశ్), జోర్హాట్(రాజస్థాన్)లలో కూడా ఎన్ఐడి దేనికదిగా ఏర్పాటై గ్రాడ్యుయేట్ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి. వీటన్నింటికి కలిపి అడ్మిషన్లకు ప్రకటన విడుదలైంది.

కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి). డిజైన్ ఎడ్యుకేషన్, సంబంధిత పరిశోధనలో గ్లోబల్ లీడర్‌గా అవతరించాలన్నది ఎన్ఐడి లక్ష్యం. విభిన్న డొమైన్లు ఇక్కడ ఉన్నాయి. కోర్సు పూర్తయ్యేనాటికి సంబంధిత పరిశ్రమలో ఇమిడిపోయే వ్యక్తిగా విద్యార్థిని తీర్చిదిద్దుతారు.

బీ డిజైన్ సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 128 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కో దానిలో 75 సీట్లు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2005 జూలై 1న లేదా ఆ తరవాత జన్మించి ఉండాలి. గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్ - పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్ట్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో అడుగుతారు. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు.

ఎం డిజైన్

ఎన్ఐడి, అహ్మదాబాద్ క్యాంపస్ గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్‌లో మాత్రమే ఎం డిజైన్ కోర్సును అందిస్తున్నారు. మొత్తం 14 డిసిప్లిన్లలో దీనిని అందిస్తున్నారు. వివరాలకు సంబంధిత బ్రోచర్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు రూ.3,000; మహిళలు రూ.2000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500, దివ్యాంగులు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబర్ 1
- **డీఏటీ ప్రిలిమ్స్ తేదీ:** డిసెంబర్ 21
- **ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** admissions.nid.edu

SCHOLARSHIP ALERT

Colgate Keep India Smiling Scholarship 2025-26

Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.

Eligibility: Indian students who are currently enrolled in Bachelor of Dental Surgery (BDS) (any year) or Master of Dental Surgery (MDS) courses in a recognised government or private institute. Applicants must have scored at least 65% marks in Class 12. Students must have an overall score of above 60% in their BDS to apply for the MDS scholarship. The annual family income of the applicants from all sources must not exceed INR 8 lakh.

Prizes & Rewards: Scholarship of INR 75,000

Last Date to Apply: 09-11-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/CKISSP7

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను

సుధీర్‌బాబు


"'జటాధర' చిత్రంలో నేను పోషించిన పాత్రను తెలుగులో ఇప్పటివరకూ ఎవ్వరూ చేయలేదు. నా సినిమా హిట్ అయితే అది నా కష్టంగా భావిస్తా. ఫ్లాప్ అయితే నా ఓటమిగా స్వీకరిస్తా' అని హీరో సుధీర్ బాబు అన్నారు. ఆయన కథానాయకుడిగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన చిత్రం 'జటాధర'. సోనాక్షి సిన్హా హీరోయిన్. ఉమేశ్‌కుమార్ బన్సల్, శివిన్ నారంగ్ నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఇందులో దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను. సినిమా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. శివుడి నేపథ్యంలో వచ్చే సీక్వెన్స్‌కు గూస్‌బంప్స్ పక్కా' అని తెలిపారు. 'జటాధర' సినిమాలో సుధీర్‌బాబు నటన అద్భుతంగా ఉంటుంది' అని శివిన్ నారంగ్ చెప్పారు. 'నాకు తెలుగు చిత్ర పరిశ్రమ అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం విషయంలో సహకారం అందించిన ప్రతీఒక్కరికీ కృతజ్ఞతలు' అని ప్రేరణ అరోరా పేర్కొన్నారు.

గెలుపు పాటతో మొదలు



కన్నడ హీరోలు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి నటిస్తున్న మల్టీస్టారర్ '45 ది మూవీ'. అర్జున్ జన్య దర్శకత్వంలో ఉమా రమేశ్‌రెడ్డి, ఎం. రమేశ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'గెలుపు తలుపు దొరికేవరకూ దిగులు పడకురా' అంటూ సాగే గీతాన్ని యూనిట్ ఆదివారం విడుదల చేసింది. దర్శకుడు అర్జున్ జన్య ఈ గీతాన్ని స్వరపరిచారు. రోల్ రైడా, వినాయక్ ఆలపించారు. సినిమాటోగ్రఫీ: సత్య హెగ్డే.

స్టైలిష్ క్లైమాక్స్‌కు సిద్ధం



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. ఈ సినిమాను షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్‌పై సాహుగారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి కీలక షెడ్యూల్ గురించి అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఆదివారం నుంచి చిరంజీవి, ఫైటర్స్ బృందంపై స్టైలిష్ క్లైమాక్స్‌ను షూట్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇది ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని, విజువల్‌గా అద్భుత అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో కథానాయకుడు వెంకటేశ్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

పెళ్లి తర్వాత ప్రేమంటే?



ప్రియదర్శి, ఆనంది జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'ప్రేమంటే'. సుమ కనకాల కీలకపాత్ర పోషిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్ మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. స్పిరిట్ మీడియా పతాకంపై రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. నవంబర్ 21న ఈ చిత్రం విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. టైటిల్‌కు తగ్గట్లుగానే ప్రేమలో ఉన్నప్పుడు పెళ్లి తర్వాత జీవితం గురించి కనే కలలు, వాస్తవ జీవితంలోని చిన్న చిన్న సమస్యలతో ఎలా మారుతుందో చూపిస్తూ ఆద్యంతం వినోదంగా సాగిన టీజర్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్‌రెడ్డి.

60వ వసంతంలోకి షారుక్



బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ తన 60వ పుట్టినరోజును ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముంబైలోని ఆయన నివాసం మన్నత్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు, ఇతర సెలెబ్రిటీలతో కిక్కిరిసిపోయింది. ఫరాఖాన్, కరణ్ జోహార్, రాణి ముఖర్జీ తదితరులు షారుక్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎప్పటి లాగే ఈసారి కూడా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది అభిమానులు షారుక్ నివాసానికి తరలి వచ్చారు.

భయం కాదు.. విధ్వంసం

షారుక్ ఖాన్ కథానాయకుడిగా సిద్ధార్థ్ ఆనంద్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం షారుక్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించి, ఓ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ముందునుంచి ప్రచారంలో ఉన్న 'కింగ్' అనే టైటిల్‌నే అధికారికంగా నిర్ణయించారు. 'నేనెంత మందిని చంపానో గుర్తులేదు. వారు మంచివాళ్లా, చెడ్డవాళ్లా అన్నది నేనెప్పుడూ అడగలేదు. వారి కళ్లల్లో భయం మాత్రమే నాకు గుర్తుంది', 'వెయ్యికి పైగా హత్యలు చేసి, వందలాది దేశాల్లో మోస్ట్ వాంటెడ్ అయిన నాకు ఈ ప్రపంచం ఇచ్చిన పేరు.. కింగ్, 'నేను భయం కాదు.. విధ్వంసం' అనే సంభాషణలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్‌మెంట్స్, మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ సినిమాలో సరికొత్త షారుక్‌ను చూస్తారని మేకర్స్ హామీ ఇచ్చారు.

మనం గర్వపడే సినిమా

రామ్ పోతినేని




రామ్ పోతినేని కథానాయకుడిగా పి.మహేశ్‌బాబు తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రచార చిత్రాలు, టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ 'ఆంధ్రా కింగ్ తాలూకా' నేను గర్వపడే సినిమా. మనమందరం గర్వపడే సినిమా. నా కెరీర్‌లో ఇంత అందమైన సినిమా ఇచ్చిన మహేశ్‌కు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కన్నడ నటుడు ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ పాత్రలో కనిపించనున్నారు. ఈనెల 28న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ్ నుని, సంగీతం: వివేక్, మెర్విన్.

వసుదేవ సుతం



మాస్టర్ మహేందర్ ప్రధాన పాత్రలో వైకుంఠ్ బోను తెరకెకిస్తున్న చిత్రం 'వసుదేవ సుతం'. ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'వసుదేవ సుతం' అంటూ సాగే గీతాన్ని హీరో ఆకాశ్ జగన్నాథ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'పల్లెటూరి వాతావరణంలో అందర్నీ కట్టిపడేసేలా చిత్రీకరించిన ఈ పాట నాకు బాగా నచ్చింది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకం ఉంది. చిత్రం ఘనవిజయం సాధించాలి' అని కోరుకున్నారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ గీతానికి మణిశర్మ సంగీతం అందించారు.

చాందినీ చిత్రం షురూ



చాందినీ చౌదరి ప్రధాన పాత్ర పోషిస్తున్న కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు తరుణ్ భాస్కర్ క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రానికి వికాస్ దర్శకుడు. సహచారి ప్రొడక్షన్ పతాకంపై సృజన్ గోపాల్ నిర్మిస్తున్నారు. సుశాంత్ యాష్కీ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా సృజన్ గోపాల్ మాట్లాడుతూ 'సైన్స్ ఫిక్షన్ డార్క్ కామెడీ జానర్లో ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. ఎవరూ ఊహించని ఒక సూపర్ హీరోను పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు. వికాస్ మాట్లాడుతూ 'అతీంద్రియ శక్తుల నేపథ్యంలో ఈ చిత్రం కథ సాగుతుంది. కాన్సెప్ట్ వీడియోను త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.



హైదరాబాద్‌లో భారీ ఈవెంట్

మహేశ్‌బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రబృందం నుంచి అప్డేట్ వచ్చింది. ఈనెల 15న హైదరాబాద్‌లో గ్లోబ్ ట్రోటర్ పేరుతో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. అందులో సినిమా టైటిల్, గ్లింప్స్ వీడియోను ఆవిష్కరించనున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఓ ఓటీటీ సంస్థ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది. కాగా, సినిమా ప్రారంభమై రెండేళ్లు అవుతున్నా మేకర్స్ నుంచి అధికారికంగా ఒక్క అప్డేట్ కూడా రాలేదు. అయితే నవంబరులో అప్డేట్ ఇస్తామని గతంలో రాజమౌళి ఓ పోస్టు చేశారు. సినిమా టైటిల్‌తో పాటు మహేశ్‌బాబు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేస్తామని చెప్పడంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే నవంబరు మొదలైనా ఎలాంటి అప్డేట్ రాలేదు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు 'నవంబరులో మీరు మాకు ఒక హామీ ఇచ్చారు. దయచేసి ఆ మాట నిలబెట్టుకోండి' అని ట్వీట్ చేశారు. దీంతో జక్కన్న కూడా 'సరే మహేశ్.. నవంబరు మొదలైంది ఇప్పుడే కదా.. మేము తప్పకుండా ఒక్కొక్కటిగా వెల్లడిస్తాం' అని సమాధానం ఇచ్చారు.



రైతుల వెతలే కథగా...

పులివెందుల మహేశ్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'స్కూల్ లైఫ్'. సావిత్రి షన్ను కథానాయిక. గంగా భవాని నిర్మించారు. హీరో సుమన్, ఆమని, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న సినిమా విడుదల కానుంది. ఇటీవలె నిర్వహించిన వేడుకలో చిత్ర దర్శకుడి తల్లిదండ్రులు ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సుమన్ మాట్లాడుతూ 'ఒక రైతు పాత్రలో రైతులకు అండగా నిలబడేలా నా క్యారెక్టర్ ఉండబోతుంది' అని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధన



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు



కార్తీక దీపారాధనలు చేస్తున్న భక్తులు

పెదకాకాని, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆదివారం భక్తులతో పెదకాకాని మల్లన్న సన్నిధి కిటకిట లాడింది. తెల్లవారుజామున ఆలయ ప్రదక్షిణ నిర్వహించి, మల్లేశ్వర స్వామి, భ్రమరాంబకు ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపారాధనలు చేశారు. స్వామి వారి దర్శనం కోసం క్యూ లైన్లో భక్తులు బారులు తీరారు. ఆలయ ఉప కమిషనర్ లీలా కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పొంగలి తో ప్రదక్షిణ..

సత్‌క్రియల ద్వారానే మోక్షం

గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ఫిరంగిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మానవాళి సత్‌క్రియల ద్వారానే దేవుడు మోక్షం కలుగు చేస్తాడని గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలోని ఆర్‌సీఎం సమాధుల తోటలో సకల ఆత్మల పండుగ సమష్టి దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. ప్రార్థనలు, దివ్య పూజాబలులు ద్వారా ఆత్మలు మోక్షం చేసుకుంటాయన్నారు. జనుల జీవన విధానాలను బట్టి మోక్షమో, నరకమో నిర్ణయించ బడుతుందన్నారు. భక్తితో చేసే ప్రతి త్యాగం ఆత్మలకు ఉపయోగ పడుతుందన్నారు. ఆత్మలకు నిత్య విశ్రాంతి కలుగ చేయాలని, కుటుంబీకులంతా ప్రార్థించాలన్నారు. సమాధులను అలంకరించి పూలు, రంగు రంగుల విద్యుద్దీపాలు వెలిగించి సమాధులను తేజోవంతంగా తీర్చిదిద్దారు. తమ పెద్దల ఆత్మల విశ్రాంతి కోసం కుటుంబీకులు చేస్తున్న పూజలు ఏసు దేవుడు ఫలింప చేశారని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సమాధులను బిషప్ ఆశీర్వదించారు. పూజలో చర్చి ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి, మద్దు బాలస్వామి తదితర గురువులు, కన్యస్త్రీలు, గుడి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



సందేశమిస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ఆక్రమణలో.. ఆనవాళ్లు

(5వ పేజీ తరువాయి)

ఉండేది. ఆలయ నిర్వహణలో పాలుపంచుకునే వారిని కశ్మీర్, తమిళనాడు నుంచి విశ్వేశ్వరశంభు ప్రత్యేకంగా తీసుకొచ్చారు. ఇలా శివాలయం అప్పట్లో ఒక వెలుగు వెలిగింది. ఇది నేడు గర్భాలయం వరకే పరిమితమై కనిపిస్తున్నది.

ఆక్రమణల మధ్య ఆనవాళ్లు మాయం..

కాకతీయుల అనంతరం జరిగిన ముస్లింల దాడుల నేపథ్యంలో గోళకీమఠం దెబ్బతింది. ఆలయ మండపాలతో పాటు గర్భగుడిలోని శివలింగాన్ని కూడా ధ్వంసం చేశారు. ఆ తర్వాత అగ్రహారంగా ఉన్న ఈ ప్రాంతమంతా కాలగతిలో ఆక్రమణల పాలైంది. ఆలయం, రుద్రమదేవి శిలాశాసనం కూడా కనిపించనంతగా గృహాలు పుట్టుకొచ్చాయి. ఆలయానికి దక్షిణంగా 20 సెంట్లు, పడమరగా 16 సెంట్లు మాత్రమే మిగిలి ఉంది. ఆలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేయాలని కోరుతూ గ్రామస్థులు ప్రభుత్వానికి అర్జీల రూపంలో విన్నవించుకున్నారు. డాక్టర్ భవానీ అనే డాక్టర్ ఇటీవల ఈ ఆలయ చరిత్రను తెలుసుకుని తన బంధుమిత్రుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణం చేస్తానని ముందుకొచ్చారు. అయితే ఆలయం చుట్టూ వున్న 33 గృహాలవారు అందుకు అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో ఆమె ఏమీ చేయలేక నిస్సహాయిరాలిగా ఉండిపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2018లో ఈ ఆలయాన్ని సందర్శించారు. అయినా అభివృద్ధిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మందడం-తుళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంబడి ఉన్న రుద్రమదేవి నిర్మించిన చెరువు కూడా మూడువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి.

2011 నుంచే మళ్లీ పూజాదికాలు

గోళకీమఠం స్ఫూర్తితో విజయవాడకు చెందిన శివస్వామి మందడం శివారులోని కృష్ణానది వెంట తాళ్లాయపాలెంలో శైవక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. మల్కాపురంలో అరకొర గోడలతో సజీవశిలాజం మాదిరి మిగిలి ఉన్న గర్భగుడిలో 2011 చిన్న శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు జరిగేలా ఏర్పాటు చేశారు. ఇందుకు ఆలయం ఎదురుగా ఉన్న షేక్ అరుణ అనే మహిళ ఆర్థికసహకారాన్ని అందించారు. ములకల ఆదినారాయణ అనే పూజారి గత ఏడాదిగా స్వచ్ఛందంగా ఆలయంలో పూజాదికాలను నిర్వహిస్తున్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొని ఇద్దరి మృతి

వినుకొండటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీనీ ద్విచక్ర వాహనం వెనుక నుంచీ ఢీ కొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మార్కాపురం రోడ్డులోని పసుపులేరు బిడ్జి వద్ద ఆదివారం రాత్రి చోటు చేసు కుంది. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కురిచేడు సమీపంలోని మునెయ్య కాలనీకి చెందిన మస్నెయ్య (18), ఆనంద్ (14) ద్విచక్ర వాహనంపై వినుకొండ నుంచి కురిచేడు వైపు వస్తున్నారు. పసుపులేరు బ్రిడ్జి సమీపంలో జగ్గయ్య పేటకు చెందిన లారీ ఆపి డ్రైవర్ బహిర్భూమి వెళ్లాడు. ద్విక్రవాహనం వెనుక నుంచి లారీని ఢీ కొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని.. మృతదేహాలను వినుకొండ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలను గుండెల్లో నింపుకున్నారు

● కమ్యూనిటీ హాల్ శంకుస్థాపనలో

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

పెదకాకాని, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): డాకర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను దళితుల గుండెల్లో నింపుకున్నారని, వాటిని ప్రతి ఒక్కరు కొనసాగించాల్సిన అవసరం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం పెదకాకానిలోని లూథర్‌గిరి యువజన నగర్‌లో నందుమౌరి టెక్ ఫౌండేషన్ అధినేత ఎర్రంరెడ్డి అనిల్‌రెడ్డి సహకారంతో నిర్మించబోతున్న కమ్యూనిటీ హాల్ భవనానికి స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. మమకారం తప్ప మోసం అంటే తెలియని అంబేడ్కర్ ఆశయాలను గుండెల్లో నింపుకున్న దళిత సోదర సోదరీమణులకు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. ఎర్రంరెడ్డి అనిల్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు ఈ ప్రాంతంతో ఎలాంటి సంబంధం లేకపోయినా అమెరికాలో తనతో ఉన్న పరిచయంతో పేదలకు సహకారం అందించాలనే నిశ్చయంతో అనిల్‌రెడ్డి ముందుకు వచ్చారని తెలిపారు. సీఎస్ఆర్ నిధులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడ కమ్యూనిటీ హాల్ కావాలని ధూళిపాళ్లని అడిగితే ఆయన మొట్టమొదటిగా ఎంపిక చేసిన ప్రాంతం లూథర్‌గిరి, యువజన నగర్ ప్రాంతం అని తెలిపారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ హాలు నిర్మాణంతో 15 ఏళ్ల నాటి కల నెరవేరిందన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో సహకారంతో ఈ నిర్మాణం చేపట్టడం గర్వకారణంగా ఉందన్నారు. ఎర్రం రెడ్డి అనిల్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, గ్రామ సర్పంచ్ గోళ్ల స్వరూపరాణి, టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పొన్నూరు యార్డ్ వైస్ చైర్మన్ తాళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెమ్మసాని, పక్కన ఎమ్మెల్యే నరేంద్ర తదితరులు

ముఖ్యమంత్రి హామీలు అమలు చేయాలి!

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 'రాజధాని ప్రాంతంలో రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. ఉన్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపించగలగాలి.' అని గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులోని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం కమిషనర్ కన్నబాబు, జాయింట్ కమిషనర్ భార్గవ తేజ సమావేశమయ్యారు. రాజధాని అంశాలపై, రాజధాని ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర మంత్రి వారితో చర్చించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్, వీధి పోటు, గ్రామకంఠం, అసైన్మెంట్ ల్యాండ్ భూసేకరణ, లేఅవుట్ డెవలప్మెంట్ సమస్యలపై జాబితాను సిద్ధం చేయాల్సి ఉందని మంత్రి సీఆర్‌డీఏ కమిషనర్‌కు చెప్పారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతుల సమస్యలకు పరిష్కారం చూపే ప్రయత్నం చేయాలని తెలిపారు. అలాగే రాజధాని ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, ఉద్యోగుల క్వార్టర్స్, విదేశీ భవన్, హడ్కోకు సంబంధించిన పెండింగ్ అంశాలు ఏమైనా ఉంటే జాబితా ఇవ్వాలని, ఆయా అంశాలపై ఢిల్లీ నుంచి తాను ఫాలోఅప్ చేస్తానని ఈ సందర్భంగా పెమ్మసాని కమిషనర్‌తో చెప్పారు.

ప్రజల గుండెల్లో ఎర్రంనాయుడు చెరగని ముద్ర

తుళ్లూరు(మందడం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీమంత్రి, స్వర్గీయ కింజరాపు ఎర్రంనాయుడు ఒక విలక్షణ నేతగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని, ప్రజాభిమానం చూరగొన్నారని సీనియర్ జర్నలిస్టు, న్యాయవాది వి.ఆదినారాయణ, అమరావతి రాజధాని ఉద్యమ నేతలు పేర్కొన్నారు. ఆదివారం ఎర్రంనాయుడు 13వ వర్ధంతి సందర్భంగా తుళ్లూరు మండలం సచివాలయ సమీపం, మందడం అమరావతి ఉద్యమ శిబిరంలో ఆయనకు నివాళులర్పించారు. భారీ ఎత్తున ఫ్లెక్సీలు, కటవుట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ, రాజధాని ఉద్యమ నేతలు కట్టా రాజేంద్ర, వీరబాబు, బెజవాడ సాంబయ్య, పాతూరి రాంబాబు, బుల్లయ్య, గోవింద్‌రెడ్డి ప్రసంగిస్తూ తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పార్టీని ఎర్రంనాయుడు బలోపేతం చేశారన్నారు. అజాతశత్రువుగా, బడుగు, బలహీనవర్గాల నేతగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యే, ఎంపీగా, కేంద్రమంత్రిగా, భారత రైల్వే బోర్డు చైర్మన్‌గా పని చేసి ఉత్తరాంధ్రతో పాటు ఉమ్మడి రాష్ట్రాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన బాటలో తనయుడు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, సోదరుడు అచ్చెన్నాయుడు పయనిస్తున్నారని పేర్కొన్నారు.



మందడంలో ఎర్రం నాయుడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆదినారాయణ, రైతు ఉద్యమ నేతలు

మహాత్ముడిని విమర్శించిన సినీ నటులను కఠినంగా శిక్షించాలి

● ఉద్రిక్తంగా ఎస్ఎస్‌యూఐ ఆమరణ నిరాహార దీక్ష


గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీని విమర్శించిన సినీ నటులను శిక్షించాలంటూ గుంటూరులో ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్రిక్తతకు దారి తీసింది. హిమనీ సెంటర్‌లో ఆదివారం ఆమరణ దీక్షకు కూర్చున్న నాయకులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో వారు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా పోలీసులు నిలువరించారు. పోలీసుల, ఎస్ఎస్‌యూఐ నాయకుల మధ్య తోపులాటలతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనతో పోలీసులు కరీంతో పాటు ఎస్ఎస్‌యూఐ నాయకులను స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇటీవల కొరియో గ్రాఫర్ శ్రేష్టివర్మ, సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగర్, నటుడు రాహుల్ రామకృష్ణ వంటి వారు మహాత్ముడితో పాటు స్వాతంత్ర్య సమర యోధులపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. మహాత్ములను అగౌరవ పరిచిన నీచులను చట్టప్రకారం కఠినంగా శిక్షించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఆందోళనకారులను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ రేపు రాక

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ మంగళవారం గుంటూరు జిల్లాలో పర్యటించనుందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటుందని చెప్పారు. అనంతరం రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్, వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలను సమీక్షిస్తుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్, ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలను సమీక్షిస్తుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర సచివాలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 1,58,175 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా, డెల్టా కాల్వలకు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ వెల్లడించారు.



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఆదివారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 4 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 589.60 అడుగులు ఉంది. ఇది 310.84 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 , ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,886, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,232, మొత్తం ఔట్‌ఫ్లో 72,151 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 72,151 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 41.19 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 78,434 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, నాలుగు గేట్ల ద్వారా 94,6044, మొత్తం 1,11,604 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

0.667 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఒక యూనిట్ ద్వారా శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.667 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 4 గేట్లను 2 మీటర్లు,2 గేట్లను మీటర్ మేర ఎత్తి 48,244 క్యూసెక్కులు, టేల్ రేస్ చానల్ ద్వారా 4288 మొత్తంగా 52,532 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 65,600 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.09 మీటర్లమేర నీరుండగా 6.799 టీఎంసీలకు సమానమన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై మండలం లోని ఉప్పలపాడు వద్ద చోటుచేసుకుంది. ఉప్పలపాడు గ్రామానికి చెందిన కన్నెదార శ్రీనివాసరావు (55) మోటారుసైకిల్‌పై నరసరావుపేటకు వస్తుండగా.. వినుకొండ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతనిని ఢీకొంది. శ్రీనివాసరావు అక్కడిక్కడే మృతి చెందాడు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ ఫాతిమా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ప్రత్తిపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీ కొనడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తుమ్మలపాలెం పెప్సీ కంపెనీ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు వివరాల మేరకు.. మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన కుంభా కోటేశ్వరరావు (65) చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో ఉంటున్న తన కుమారుడి వద్ద ఉంటున్నాడు. శనివారం వృద్ధాప్య పింఛను తీసుకునేందుకు కుమారుడు సింగుబాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతున్నాడు. జాతీయ రహదారిపై వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం వారిని వేగంగా ఢీ కొనడంతో.. వెనుక కూర్చున్న కోటేశ్వరరావు కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో.. 108 అంబులెన్సులో గుంటూరులోని ఓ హాస్పిటల్‌కు అతనిని తీసుకెళ్లారు. అనంతరం జీజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండవీడుకోట ఘాట్‌లో..

విరిగి పడిన కొండచరియలు

● ఘాట్ మార్గం మూసివేత

యడ్లపాడు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ప్రముఖ పర్యాటక కేంద్రం కొండవీడు కోట ఘాట్ మార్గంలో కొండ చరియలు ఆదివారం విరిగి పడ్డాయి. దీంతో ఘాట్ మార్గాన్ని అధికారులు మూసివేశారు. రోడ్డుపై బండ రాళ్ల తొలగింపు పనులను అటవీశాఖ అధికారులు చేపట్టారు. జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణప్రియ ఈ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండలపై నుంచి ఉధృతంగా ప్రవహించిన వర్షపు నీటితో పాటు బండరాళ్లు పెద్ద ఎత్తున ఘాట్ మార్గంపైకి జారిపడ్డాయన్నారు. బండరాళ్లను తొలగించే వరకు రాకపోకలను నిషేధించినట్లు వెల్లడించారు. ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా తీసుకున్న చర్యలను పర్యాటకులు అర్థం చేసుకోవాలని కోరారు. రాకపోకల పునరుద్ధరణను త్వరలో తెలియజేస్తామన్నారు. మరో రెండు రోజులు పర్యాటకులు కొండవీడుకోట సందర్శనకు రావద్దని డీఎఫ్‌వో తెలిపారు.



రాళ్ల తొలగింపు పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కృష్ణప్రియ

తెరుచుకున్న ఆలయ ద్వారాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చుండూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మున్నంగివారిపాలెంలోని తుంగభద్ర కాల్వ పక్కనే ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర పాపవినాశన స్వామి దేవాలయ పూజల విషయంలో వివాదం ఏర్పడింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో గుడివద్ద వివాదం - తెరుచుకోని ఆలయ ద్వారాలు అనే శీర్షికన ఆదివారం వెలువడిన కథనానికి జిల్లా దేవదాయ శాఖ అధికారులు స్పందించారు. ఆ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, డీసీ కేబీ శ్రీనివాస్ ఆదేశాలతో బాపట్ల డీఈవో సూర్యప్రకాశ్, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ నాగరాజు, ఆలయ ఈవో నాగలక్ష్మి ఇతర సిబ్బంది ఉదయాన్నే దేవాలయ ప్రాంగణానికి చేరుకుని భక్తులు, గ్రామస్థులు, స్థానిక నాయకులతో చర్చించారు. అనంతరం అధికారులు ట్రస్టీ పేరుతో వ్యవహరిస్తున్న గాదె బాలకోటిరెడ్డి నుంచి గుడి తాళాలు తీసుకుని.. భక్తులు యథావిధిగా పూజలు నిర్వహించడానికి అవకాశం కల్పించారు. దీనితో మహిళా భక్తులు కార్తీక మాసంలో దేవాలయంలో పూజలకు అవకాశం లభించడంతో సంతోషం వ్యక్తం చేశారు.



అధికారుల సమక్షంలో తాళాలు తీస్తున్న పూజారి

అరకు, యల్హాంకకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా గుంటూరు మీదగా అరకు, యల్హాంకకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 08551 అరకు - యల్హాంక స్పెషల్ ఈ నెల 13, 23 తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు గుంటూరు చేరుకుంటుందని తెలిపారు. 08552 యల్హాంక - అరకు స్పెషల్ ఈ నెల 14, 24 తేదీల్లో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2 గంటలకు గుంటూరుకు వస్తుందని పేర్కొన్నారు. 08553 శ్రీకాకుళం రోడ్డు - బెంగళూరు కంటోన్మెంట్ ప్రత్యేక రైలు 21న, 08554 బెంగళూరు కంటోన్మెంట్ - శ్రీకాకుళం రోడ్డు స్పెషల్ 24న గుంటూరు మీదగా నడపనున్నారు. అయితే డివిజనల్ హెడ్‌క్వార్టర్స్ గుంటూరులో హాల్టింగ్ ఇవ్వకుండా నంద్యాలలో కల్పించడంపై ప్రయాణికులు, వినియోగదారుల సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వాల్తేరు డివిజన్ హెడ్‌క్వార్టర్స్ దృష్టికి తీసుకెళతామన్నారు.

కోడి పందేలు, పేకాట స్థావరాలపై దాడులు

నాదెండ్ల, క్రోసూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ఆదివారం జూదరుల ఆటకట్టించారు. కోడిపందేలు, పేకాట స్థావరాలపై దాడులు చేశారు. నాదెండ్ల మండలంలోని ఎండుగుంపాలెం - కోమటినేనివారిపాలెం వెళ్లే మార్గంలోని కోడి పందేల స్థావరంపై ఎస్ఐ పుల్లారావు సిబ్బందితో దాడి చేశారు. వారిని చూసి కొందరు పారిపోగా 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. 26 మోటారు బైక్‌లు, రూ.19,400 నగదు, సెల్‌ఫోన్లతో పాటు నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. క్రోసూరు మండలంలోని బయ్యవరం పొలాల్లో పేకాట స్థావరాలపై దాడి చేసినట్లు ఎస్ఐ రవిబాబు తెలిపారు. ఏడుగుర్ని అరెస్టు చేసి రూ.79,650 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం : కలెక్టర్

బాపట్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదిక కలెక్టరేట్‌లో సోమవారం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పీజీఆర్ఎస్ అర్జీలపై జిల్లా అధికారులతో సమావేశం ఉంటుందన్నారు. 10 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అర్జీలు స్వీకరించబడతాయన్నారు. అదేవిధంగా ప్రతి రెవెన్యూ డివిజన్, మండల తహసీల్దార్ కార్యాలయాలలో కూడా అర్జీలు స్వీకరించబడతాయన్నారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికి పరిష్కారం కాకపోయిన, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవటానికి 1100కు కాల్ చేయవచ్చుఅన్నారు. అదేవిధంగా మీ కోసం వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చు అని తెలిపారు.

పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

● అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాయకుల డిమాండ్



సభలో మాట్లాడుతున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా నాయకులు

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో కాకుండా ప్రభుత్వమే నిర్మించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలరాజు, నాసర్‌జిలు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు జాతర్ ఇచ్చాపురం నుంచి హిందుపురం వరకు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం 11వ రోజు బాపట్ల చేరుకుంది. అంబేద్కర్ సర్కిల్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించారు. జిల్లా నాయకులు అక్కల పోలిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన పార్వతీపురంలో విద్యార్థులకు నీళ్ళు లేక చనిపోతుంటే నేటికి మంత్రులు, అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పీపీపీ పేరుతో ప్రైవేట్, కార్పోరేట్ వ్యక్తులకు అప్పజెప్పే ఆలోచన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కుల్లాయిస్వామి, నాగభూషణం, కోశాధికారి రవి పాల్గొన్నారు.

తేజస్వియాదవ్ పేరిట వేణుగోపాలస్వామికి పూజలు


పూజలు నిర్వహిస్తున్న సమాజీవాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు తదితరులు

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బీహార్‌లో జరుగుతున్న ఎన్నికలలో తేజస్వియాదవ్ గెలుపు కోరుతూ సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షులు మేదా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యాదవ ఎంప్లాయిస్, ప్రొఫెషినల్ అసోసియేషన్ వారు ఆదివారం శ్రీ వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని దర్శిపెదమస్తాన్ నగర్‌లో ఉన్న శ్రీరుక్మిణి సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో పూజలు చేశారు. తేజస్వియాదవ్ నాయకత్వంలోని మహాగడ్ బంధన్ బీహార్‌లో, నవీన్‌యాదవ్ తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఘన విజయం సాధించాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దర్శి సాంబశివరావు, పులి శరత్‌బాబు, బుర్ల నాగరాజు, బోయన శ్రీనివాసరావు, వడ్లమూడి నాగరాజు, మద్దిబోయిన తాతయ్య, పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, పిన్నిబోయిన ప్రసాద్, దర్శి సింగయ్యయాదవ్, కొమ్మనబోయన ఫణియాదవ్, యర్రాకుల వాసుయాదవ్, ఎల్లావుల సోహిత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాస్కరరావు జన్మదిన వేడుకలు


భాస్కరరావు దంపతులను సన్మానిస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్‌లు, సిబ్బంది

కర్లపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా యూనియన్ బ్యాంక్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు, ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్‌లకు ఆలిండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్ల అసోసియేషన్ ఛైర్మన్ మెండు మహేంద్ర భాస్కరరావు చేస్తున్న సేవలు అద్భుతమని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌లు సాగర్, సంగీత్ అన్నారు. ఎంఎం భాస్కరరావు 78వ జన్మదిన వేడుకలను ఆయన స్వగృహంలో పలు యూనియన్ బ్యాంక్ శాఖల మేనేజర్‌లు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్‌రరావు, జయంతి దంపతులను దుశ్శాలువాలు, గజమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్‌లు సంగీత్‌కుమార్, సాగర్, వినోద్, అసిస్టెంట్ మేనేజర్‌లు జానకిరామ్, జగదీష్, మహేష్, కిషోర్, కృష్ణమోహన్, నన్ని, మదు, రాజు, దేవేంద్రరాజు, చిన సత్యనారాయణరాజు, నరసింహమూర్తిరాజు, వెంకటరామరాజు, డాక్టర్ మెండు అవంతి, మెండు శ్రీనివాస్, బొడ్డు సాయిమహేంద్రబాబు, మేరువ అంజనేయప్రసాద్, మెండు శ్రీనివాస్, బసవ పూర్ణమ్మ, మెండు వెంకటేశ్వరరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. జిల్లా నుండి 120 మంది స్త్రీ, పురుష క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. 30 సంవత్సరాల నుంచి వంద సంవత్సరాలలోపు క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో గెలుపొందిన క్రీడాకారులు డిసెంబరు 13, 14 తేదీలలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులు అన్నారు. సీనియర్ క్రీడాకారులు కుంభా సాంబశివరావు, శంకరరావు, రాముడు, సీతారామారావు, సురేంద్ర, రవి, సుబ్బారావు, సత్యనారాయణ, ఆనందరావు, అంజమ్మ పాల్గొన్నారు. పోటీలను మాస్టర్స్ అథ్లెటిక్స్ సెక్రటరి ఎస్కే నజీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు

డ్రెయిన్‌పై అక్రమ కట్టడాలు

● మురుగునీరు పారుదలకాక అవస్థలు
● అధికారులకు తెలిపినా పట్టించుకోని వైనం

రేపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె మండలంలోని చాత్రగడ్డ-కామరాజుగడ్డ నార్త్‌కు వెళ్ళే డ్రెయిన్ కల్వర్టు సమీపంలో ఇరుప్రక్కల అక్రమ కట్టడాలతో మురుగునీరు పారుదలయ్యే పరిస్థితి లేదు. దీంతో నీరు నిల్వ ఉండి పచ్చగామారి దుర్వాసన వెదజల్లుతూ దోమలకు నిలయాలుగా మారి గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. డ్రెయినేజీ, పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో డ్రెయిన్‌కు ఇరుపక్కల సుమారు 60 గృహాలు ఉన్నాయి. 2018 నుంచి ఇప్పటివరకు పలుమార్లు అధికారులకు తెలిపినా వచ్చి చూసి వెళుతున్నారే తప్పా డ్రెయిన్‌కు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మొంథా తుఫాన్ కారణంగా భారీగా వర్షం పడటంతో డ్రెయిన్ పొర్లి పొంగిపోవటం చుట్టు ప్రక్కల రహదారులు, గృహాల్లోకి చేరి నీరుపోయే మార్గం లేక మురుగువాసన దోమల బెడద విపరీతంగా పెరిగి అంటువ్యాదుల బారిన పడుతున్నారు. గృహాల్లో నుంచి వచ్చే మురుగునీరు డ్రెయిన్‌లో నుంచి పారుదల అయ్యే పరిస్థితి లేదు. గత నాలుగు సంవత్సరాలుగా డ్రెయిన్‌లో నీరుపారుదల కాక అవస్థలు పడుతున్నారు. కల్వర్టుపై అక్రమ కట్టడాలతో డ్రెయిన్ మొత్తం పూడుకుపోయి మురుగునీరుపారుదల నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు అక్రమ కట్టడాలను తొలగించి డ్రెయిన్‌లో మురుగునీరు పారుదలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


చాత్రగడ్డ-కామరాజుగడ్డనార్త్ డ్రెయిన్‌లో పారని మురుగునీరు


అక్రమ కట్టడాలతో పూడిపోయిన చాత్రగడ్డ డ్రెయిన్

ముగిసిన మూడు రోజుల ఉపాధ్యాయుల శిక్షణ

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల భవితా కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు మూడురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సమావేశాన్ని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి డి.ప్రసాదరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా కార్యక్రమాల వల్ల ఆధునిక బోధన పద్ధతులు, మెళుకువలు నేర్చుకొని దివ్యంగా విద్యా సామర్థ్యాలను పెంచే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్పీకర్ ఉపకార్ కడప ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఆర్ కృష్ణారావు, రీజనల్ డైరెక్టర్ ప్రసాదబాబు, ఛైల్డ్ ఫిజియాలసిస్ట్ సి.రవి భార్గవ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాథోడు విట్టల్, ముత్తాయపాలెం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, రీసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.


శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు

శ్రీ బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు


శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారిని ఆదివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు నాగుల శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.


ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో నరసింహమూర్తి

● శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానాన్ని ఆదివారం ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి దంపతులు దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వారిని ఆలయ మర్యాదలతో ఆలయ కార్య నిర్వహణాధికారి జి.నరసింహమూర్తి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి వారిని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. వీరితోపాటు చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ పాల్గొన్నారు.

నాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తా

● ఏపీ రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్ మందపాటి ఆంద్రేయ

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాటక రంగ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్ మందపాటి ఆంద్రేయ అన్నారు. తెలుగు జాతీయ కళాకారుల సేవాసంఘం ఆధ్వర్యంలో గర్జించిన కొదమసింహాలు సాంఘిక నాటక పుస్తకాన్ని ఆదివారం బాపట్ల అంబేద్కర్ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాటకరంగంలో పేదకళాకారులకు పెన్షన్ కోసం, నాటకరంగ కార్యాలయం ఏర్పాటుకు స్థలం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రచయిత డాక్టర్ గొర్రెముచ్చు వందనం, అంబేద్కర్ సేవాసమాజం అధ్యక్షుడు, న్యాయవాది దగ్గుమల్లి కిరణ్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ దగ్గుమల్లి ధర్మారావు, కొచ్చెర వినయ్‌రాజు, ఏపూరి బాబురావు, గొర్రెముచ్చు మీరయ్య, రేగులగడ్డ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సాంఘిక నాటక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంద్రేయ తదితరులు

సేవారంగంలో ముందంజ

● వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ పులికొండ


తుఫాన్ బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వాసవి క్వీన్స్, వాసవిక్లబ్ సేవా సభ్యులు

కర్లపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుల, మతాలకు అతీతంగా వాసవి క్లబ్, వాసవీ క్వీన్స్ క్లబ్ సభ్యులు సేవా రంగంలో ముందుంటారని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ పులికొండ శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవి క్వీన్స్, వాసవిక్లబ్ సేవా సభ్యులు పిల్లలు ఆటవస్తువులు, పేద విద్యార్థులకు రూ.13 వేల ఆర్థికసాయం, పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. తుఫాన్ బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, మురళి, బొలిశెట్టి రాంబాబు, బొలిశెట్టి బాపారావు, ఆకుల మురళీకృష్ణ, ఆలపాటి అనూష, శ్వేత, పరమేశ్వరి, వసుంధర పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు బియ్యం పంపిణీ

కర్లపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం మండలం ఎం విరాజుపాలెంలో తుఫాన్ బాధితులైన రెండు కుటుంబాలకి 10 కేజిల బియ్యం అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు పెనుమెత్స శివాజి రాజు తెలిపారు. కార్యక్రమంలో మంతెన నాగరాజు, ఆట్ల శ్రీనివాస రెడ్డి, వేగిరాజు శ్రీనివాసరాజు, అక్కల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడూరు గ్రామపంచాయతీలో గల 3వనెంబరు రేషన్ దుకాణంలో మొంథా తుఫాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు 25కేజిల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోడూరు గ్రామపంచాయతీ సర్పంచ్ ఐనంపూడి శ్రీనివాసరావు, కోడూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు జాలాది అశోక్, కోమలి సొసైటీ అధ్యక్షుడు ఉయ్యూరు వెంకటేశ్వరరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్.గోపికృష్ణ, వీఆర్వో కె.వెంకటేశ్వరరెడ్డి, తోకల చంద్రపాల్, రేషన్ డీలర్ ఐనంపూడి సాంబశివరావు పాల్గొన్నారు

శ్రీకృష్ణ రాధా దేవాలయానికి విరాళం

కర్లపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పెద్దగొల్లపాలెంలో నిర్మిస్తున్న శ్రీకృష్ణ, రాధ దేవాలయానికి ఎండీ మొహిద్దీన్‌బేగ్ రూ.10 వేల విరాళాన్ని వారి తల్లిదండ్రుల పేరున ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దగొల్లపాలెం సర్పంచ్ నాని, దమ్మనవారిపాలెం మాజీ సర్పంచ్ వరప్రసాద్, కర్లపాలెం ఉప సర్పంచ్ పఠాన్, మాజీ ఉపసర్పంచ్ అజీమ్‌ఖాన్, తిమ్మరాజు సుబ్బారావు, పేరలి సుభాని, నాగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణ రాధా దేవాలయానికి విరాళం అందజేస్తున్న ఎండీ మొహిద్దీన్‌బేగ్ తదితరులు

క్రికెట్ వీక్షించేందుకు డిజిటల్ లైవ్ స్క్రీన్


ఉమెన్స్ క్రికెట్ వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షిస్తున్న విద్యార్థులు

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు బాపట్ల మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లోని ఇండోర్ స్టేడియంలో క్రికెట్ వీక్షించేందుకు డిజిటల్ లైవ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. క్రికెట్ ఉమెన్స్ వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించే విధంగా స్క్రీన్ ఏర్పాటు చేయటంతో విద్యార్థులు అక్కడకు చేరుకొని ఆదివారం సాయంత్రం క్రికెట్ వీక్షించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థవారు ఈవిధంగా ఏర్పాటు చేయటంపై క్రీడాకారులు, క్రీడాభిమానులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

క్షీణిస్తున్న పారిశుధ్యం... విజృంభిస్తున్న దోమలు

● అల్లాడుతున్న ప్రజలు... పట్టించుకోని అధికారులు


11వవార్డు విద్యానగర్‌లో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


రోడ్డుపై నిలిచిన నీటిలో సంచరిస్తున్న పందులు

బాపట్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రధాన రహదార్లు మినహా మిగిలిన అన్ని ప్రాంతాలలో పారిశుధ్యం నానాటికి క్షీణిస్తున్నది. పారిశుధ్యం క్షీణించటంతో దోమల వ్యాప్తి పెరిగిపోతున్నది. దీనివల్ల ప్రజలు అల్లాడిపోతున్నారు. అయినప్పటికి సంబంధితాధికారులు పట్టించుకోవటంలేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. పట్టణంలోని 11వవార్డు విద్యానగర్‌లో సీసీరోడ్లపై నిలిచిన నీరు కూడా బయటకెళ్ళే పరిస్థితి కనిపించటంలేదు. పైగా నిలిచిన నీరు మురుగుగా మారటంతో పందుల స్వైరవిహారం చేస్తున్నాయి. బాపుడా ఛైర్మన్ నివాసం ఉండే ఈ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందనే విమర్శలున్నాయి. ఈ కాలనీకి సమీపంలో 1000 కుటుంబాలకుపైగా నివాసం ఉంటున్న ఫ్యాడిసన్‌పేట జగనన్నకాలనీ వాసుల పరిస్థితి కడుదయనీయంగా ఉంది. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షపునీటితోపాటు వరద నీరు కూడా కాలనీని చుట్టుముట్టింది. దీనివల్ల విషపురుగులు, దోమలు దాడి చేసి అక్కడ నివాసం ఉంటున్నవారిని ఇబ్బంది పెడుతున్నాయి. ఎక్కడ అంటువ్యాధులు వ్యాపిస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అదేవిధంగా మూడోవ వార్డు రాజీవ్‌గాంధీకాలనీలలో ఖాళీస్థలాలు, అక్రమ లేఅవుట్‌లు లోలెవల్‌లో ఉండటం వలన నెలలు కొద్ది నిలిచిన మురుగునీరు ఎండటంలేదు. అదేవిధంగా గంగపుత్రకాలనీ, చెంగల్రాయుడుతోట, ఫ్యాడిసన్‌పేట, ఆంధ్రకేసరి నగర్, శారదాపురి కాలనీతో పాటు అనేక మురికివాడల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఆదివారం మరలా వర్షం కురవటంతో ప్రజలు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన కూడళ్లే కాకుండా మురికివాడలలో కూడా శానిటేషన్ పనులు నిర్వహించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.


రాజీవ్‌గాంధీకాలనీలోని అక్రమ లేఅవుట్‌లో నెలలకొద్ది నిలిచి ఉన్న మురుగునీరు

మత్స్యకార జనాభా గణనకు సహకరించండి

● కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని

రేపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సముద్ర మత్స్య రంగం సమగ్రాభివృద్ధి లక్ష్యంగా జాతీయ సముద్ర మత్స్యగణన 2025 నవంబరు 3 నుంచి డిసెంబరు 18 వరకు నిర్వహిస్తున్నారని, దీనికి మత్స్యకారులంతా సహకరించాలని కృష్ణా పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు అన్నారు. జాతీయ సముద్రమత్స్యకార జనాభా గణన 2025 పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని తీరప్రాంత రాష్ట్రాలు, లక్ష్యదీప్ అండమాన్‌తోసహా కేంద్రపాలితప్రాంతాల్లో ఈ జనగణన జరుగుతుందని తెలిపారు. మత్స్య మంత్రిత్వశాఖ తరుపున దేశంలోని సుమారు 4 వేల గ్రామాల్లో నివశిస్తున్న 1.2 మిలియన్లకుపైగా మత్స్యకార కుటుంబాలను కవర్ చేసి ఈ భారీ డేటా సేకరణ ప్రాజెక్టును ఐసీఏఆర్ సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అమలు చేస్తుందన్నారు. ఈ ముఖ్యమైన జాతీయ జనాభాగణన కోసం విలువైన సమాచారాన్ని అందించటం ద్వారా సముద్రరంగంపై దృష్టిసారించిన దేశపురోగతిలో చురుకైన భాగస్వాములు కావాలని, ఈ రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పని చేస్తున్న మత్స్యకార కుటుంబాలు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొక్కిలిగడ్డ వీర్లంకయ్య, తిరుమలశెట్టి తాతయ్య, ఎం.నాగరాజు, పీతా నాగబాబు తదితరులు పాల్గొన్నారు.


జనాభా గణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పంతాని మురళీధరరావు, మత్స్యకార నాయకులు

ఇరిగేషన్ నూతన కమిటీ ఎన్నిక

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. మండల పరిధిలోని వెల్లటూరు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో కేడబ్ల్యూ డివిజన్ తెనాలి ఐసి అసిస్టెంట్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. తెనాడి డివిజన్ అధ్యక్షుడిగా షేక్ బషీద్‌వలి, జనరల్ సెక్రటరీగా కె.లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీగా ఎం.రాంబాబు, కోశాధికారిగా ఆర్.నాగమణిలను ఎన్నుకున్నారు. సర్కిల్ కమిటీ ఐసి అసిస్టెంట్స్ సమావేశం నిర్వహించి నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్.పైడియ్య, సెక్రటరీగా పి.ప్రకాష్, ట్రెజరర్‌గా వి.వెంకటేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ యు.కోటిలింగం, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ టి.అప్పారావు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ షేక్ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెనాలి డివిజన్ అధ్యక్షుడు బషీద్‌వలి

భక్తులు పోలీసుల సూచనలు పాటించాలి : ఎస్ఐ

కొల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం స్నానాలు ఆచరించే భక్తులు పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలని ఎస్ఐ అమరవర్ధన్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలోని చిలుమూరులో ఉన్న శివాలయానికి వచ్చే భక్తులు కార్తీక స్నానాలు చేసేందుకు కృష్ణానదిలో దిగవద్దని కోరారు. చిలుమూరు కృష్ణానది వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఘనంగా క్షీరాబ్ధి ద్వాదశి పూజలు


ప్రత్యేకఅలంకరణలో చెన్నమల్లేశ్వరస్వామి

రేపల్లె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో కార్తీక క్షీరాబ్ధిద్వాదశి సందర్భంగా ఆదివారం శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆయా ఆలయాల్లో 360 దీపారాధన ఒత్తులు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, ఓల్డుటౌన్ శివాలయం, ముక్తేశ్వరస్వామి దేవాలయం, చౌడేశ్వరస్వామి దేవాలయం, బాలకోటేశ్వరస్వామి దేవాలయాల్లో ఆయా ఆలయఅర్చకులు ఏకాదశి రుద్రాభిషేకం, పంచామృతాల అభిషేకం నిర్వహించి శివుని ప్రీతికరమైన మారేడుదళాలు దండలువేసి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో దివివెంకటఅప్పలాచార్యులు ఏర్పాట్లు చేశారు.

కొండెక్కిన కూరగాయ ధరలు

● వినియోగదారునికి భారంగా మారిన వైనం


మార్కెట్‌లో కూరగాయలు

వేమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఏర్పడిన అల్పపీడనం, మొంథా తుఫాన్ కారణంగా వర్షాలు కురవటంతో కూరగాయలు పంటలు దెబ్బతిన్నాయి. దీంతో పల్లె గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే కూరగాయల రవాణా గత వారం రోజుల నుంచి నిలిచిపోయింది. సుదూర ప్రాంతాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు సరఫరా అవ్వడంతో వాటి ధరలకు రెక్కలు వచ్చాయి. ఏ రకం కూరగాయ తీసుకోవాలన్నా సామాన్య మానవుడే కాకుండా ప్రతి వినియోగదారునికి భారంగా మారింది. పంటలు దెబ్బతినడంతో పాటు రవాణా సౌకర్యం కూడా ఇబ్బంది కల్పించడంతో పట్టణాలే కాకుండా పల్లెలోని అమ్మకందారులు ఇష్టానుసారంగా ధరలు పెంచే అమ్ముతున్నారు. పచ్చిమిర్చి కిలో రూ.40 నుంచి రూ.60కి, దొండకాయలు రూ.50 నుంచి రూ.75, దోసకాయలు రూ.30 నుంచి రూ.45, వంగ రూ.50 నుంచి రూ.80 క్యారెట్ రూ.55 నుంచి రూ.75, చిక్కుడు రూ.100 నుంచి రూ.180, టమోటా కిలో రూ.30 నుంచి రూ.60-70 దాకా ఇలా ప్రతి కూరగాయ ధరలు అనూహ్యంగా పెరిగాయి. వీటితో పాటు ఆకు కూర ధరలు పరిశీలిస్తే గోంగూర, తోటకూర, బచ్చలి, మెంతి తదితర ఆకు కూరలు వర్షాలకు ముందు ఒక్కొక్క కట్ట ధర రూ.10 లకే లభ్యమయ్యేది. అలాంటిది ఈ రోజున ఒకసారిగా రూ.15-20 దాకా ధరను పెంచి అమ్ముతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల ధరల నియంత్రణకు వర్షాలు పడుతున్న తరుణంలోని చర్యలు తీసుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. తిరిగి గ్రామాల్లో కూరగాయ పంటలు దిగుబడి అందే వరకు వాటి ధరలు కొండెక్కి ఉంటాయని భావిస్తున్నారు.

క్రీడాకారులకు కులమతాలు ఆపాదించవద్దు

● మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులకు కుల, మతాలను ఆపాదించవద్దని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ జెమీమా రోడ్రిగ్స్‌తో పాటు మహిళా క్రికెట్ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్న భారత దేశ జట్టును ఫైనల్‌కు చేర్చిన జెమీమా రోడ్రిగ్స్‌తోపాటు మహిళా క్రీడాకారులందరిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన కోరారు.

అవీ..ఇవీ..

భక్తిశ్రద్ధలతో కార్తీక వనభోజనాలు


వనభోజనాలు చేస్తున్న ఆర్యవైశ్యులు

పంగులూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో ఆర్యవైశ్య కార్తీక వన భోజన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్యులతో పాటు అయ్యప్ప స్వాములు ఈ వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారని ఆర్యవైశ్య ప్రతినిధి పల్లపోతు శ్యాసుందర్ తెలిపారు.

సముద్ర స్నానాలు నిషేధం : కలెక్టర్

పర్చూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నేటి కార్తీక సోమవారం నుంచి పౌర్ణమి రోజు వరకు సముద్ర స్నానాలకు ప్రభుత్వం నిషేధించింది. ఆ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్తీక మాసంలో సముద్ర స్నానాలు చేస్తే సర్వదోషాలు వీడి సుఖశాంతులుంటాయన్న నమ్మకంతో ఏటా భక్తులు సముద్ర స్నానానికి వెళుతుంటారు. అయితే తుఫాను ప్రభావంతో సముద్రంలో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉండడంతో భక్తులు, పర్యాటకుల భద్రత నేపథ్యంలో అధికారులు అనుమతికి నిరాకరించారు.

తీర ప్రాంతాలు మూసివేత

చినగంజాం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మోటుపల్లి, బాపయ్యనగర్, పల్లెపాలెం సముద్ర తీరప్రాంతాలను మూసివేసినట్లు చినగంజాం ఎస్ఐ శీలం రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో సముద్ర తీర ప్రాంతం తీవ్రంగా దెబ్బతిని ప్రమాదకర పరిస్థితులు ఉన్నందున పర్యాటకులకు, సోమవారం కార్తీక పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు తీరప్రాంతాల్లో అనుమతి లేదన్నారు. సాదారణమైన అనుకూల పరిస్థితులు ఏర్పడిన అనంతరం సముద్ర తీరప్రాంతాలకు అనుమతి ఇవ్వనున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

తీరంలో కార్తీక స్నానాలకు అనుమతి లేదు

ఇంకొల్లు, నవంబరు 2,(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో సముద్రతీర ప్రాంతాలు కోతకు గురైనందున ఈ నెల 3, 4, 5 తేదీలలో కార్తీక స్నానాలు చేసేందుకు అనుమతి లేదని ఇంకొల్లు సీఐ వై.వి రమణయ్య తెలిపారు. బీచ్ మూసివేసినట్లు తెలిపారు.

'పౌర్ణమి సాగర హారతి'కి ఏర్పాట్లు

● ఓంకేశ్వర్ నుండి నర్మదా మరకతభానులింగం


పూజల్లో పాల్గొన్న భక్తులు

కొత్తపేట(చీరాల), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు తీరంలో బుధవారం పౌర్ణమి సాగర హారతి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు డా. తాడివలస దేవరాజ్ చెప్పారు. ఇటీవల ఓంకేశ్వర్ నుంచి నర్మదా మరకత భానులింగాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ సహకారంతో ఉజ్జయిని శ్రీ మహాకాళేశ్వర ఆలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కొత్తపేట ఓంకారేశ్వర ఆలయంలో పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాగర హారతికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ గుప్తా, హిందూ చైతన్య వేదిక సభ్యులు డా.శబరి, బుర్ల సాంబశివరావు, సురేష్, మురళీ, మల్లికార్జున్‌రావు, సతీష్ పాల్గొన్నారు.

5న శింగరకొండ గిరి ప్రదక్షిణ

అద్దంకి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం శింగరకొండలో గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావులు తెలిపారు. ఉదయం 6:30 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. 6:30 గంటలకు ఉసిరిచెట్టు పూజా కార్యక్రమం జరుగుతుందని భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి


దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అద్దంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి 417 జయంతి మహోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని కాకానిపాలెం వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, గణపతిసేవ, కంకణాధారణ, అభిషేకము, అఖండజ్యోతి ప్రజ్వలన, మహానివేదన నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నుపల్లి శ్రీనివాసాచారి, జాగర్లమూడి శ్రీనివాసరావు, మిద్దెబోయిన ఆంజనేయరాజు, టీడీపీ అద్దంకి క్లస్టర్ ఇన్‌చార్జ్ కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, ఉండవల్లి కృష్ణారావు, కనపర్తి రమ్యకృష్ణ, వెంకటనారాయణమ్మ గోపి, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొండ్రగుంట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో పూజలు

మార్టూరు : పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని బొబ్బేపల్లి దండుదారి వద్ద వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందమాంబ సమేత వీర బ్రహ్మేంద్రస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. తరువాత భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

చోరీ కేసులో 10 మంది మహిళలు అరెస్ట్

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో పది మంది మహిళలను చీరాల వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం పట్టణంలోని వన్‌గ్రామ్ గోల్డ్ దుకాణంలో సుమారు రూ.55 వేలు విలువైన వన్‌గ్రామ్ గోల్డ్ అపహరించారు. ఈ మేరకు నమోదైన కేసులో రామ్‌నగర్, ఆదినారాయణపురం ప్రాంతాలకు చెందిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

రాకపోకలకు నేటికీ తప్పని ఇక్కట్లు

- పలు గ్రామాల్లో దెబ్బతిన్న వంతెనలు
- నల్లవాగుపై ప్రమాదకరంగా బ్రిడ్జీ
- మోదేపల్లి వద్ద తెగిపోయిన వైనం
- మూడు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- లోతట్టు ప్రాంతాలను నేటికీ వదలని వరదనీరు
- అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం


మోదేపల్లి వద్ద కోసుకుపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

అద్దంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందల వాహనాలు ప్రయాణించే అద్దంకి-రేణింగవరం రోడ్డులో నల్లవాగుపై ఉన్న కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ ప్రభావంతో నల్లవాగుకు వరద ప్రవాహం పెరిగింది. కల్వర్టు సపోర్ట్ వాల్ కోసుకుపోయింది. అసలే శిథిలావస్థకు చేరిన కల్వర్టు వరదతో మరింత బలహీన పడింది. కల్వర్టు ఇరుకుగా ఉండడంతో వాహనాలు ఎదురెదురు వచ్చిన సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. అద్దంకి నుంచి రేణింగవరం వరకు డబుల్ రోడ్డుగా మార్చినప్పటికి నల్లవాగు కల్వర్టు మాత్రం చిన్నదిగా ఉంది. జార్లపాలెం, కశ్యాపురంల వద్ద ఉన్న కల్వర్టులు కూడా దెబ్బతిన్నాయి. వర్షాల సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాహనాల రాకపోకలు పెరిగినందున మూడు వాగులపై వంతెనల నిర్మాణం చేపట్టాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

బల్లికురవ : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో రహదారులపై వర్షంనీరు వీడలేదు. గ్రామాలలో దీంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలోని కొప్పెరపాడు గ్రామంలోని ఉన్నత పాఠశాల పక్కన ఉన్న వీధిలో వారం రోజుల నుంచి వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచి ఉంది. ఈ నీరు వెళ్లే కాలువలు లేకపోవడంతో అలానే ఉంది. ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. కాలువలు లేకపోవడంతో ఈ నీరు అలానే పాచిపట్టిందని ప్రజలు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, రోడ్లపై నీరు నిలుస్తోందని, విద్యార్థులు సైతం పాఠశాలకు రావాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే వర్షపు నీరు ముందుకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంగులూరు : పంగులూరు ఇసుకవాగులో నేల చప్టాపై గుంతలను పూడ్చేందుకు ఉపయోగించిన బంకమట్టితో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మొంథా తుఫాన్ కారణంగా వరద తాకిడికి పంగులూరు నుంచి తక్కెళ్లపాడు వెళ్లే రోడ్డులోని నల్లవాగు చప్టాపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులు పూడ్చేందుకు నల్లటి బంకమట్టిని వినియోగించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అద్దంకి : మండల కేంద్రమైన అద్దంకితో మండలంలోని మూడు గ్రామాలకు రాకపోకలు నేటికీ ప్రారంభం కాలేదు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన మరో వారం పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. తిమ్మాయపాలెం-ఇలపావులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో మోదేపల్లి వద్ద చిలకలేరు వాగు ఉధృతికి రోడ్డు కోసుకుపోయింది. అదే సమయంలో పేరాయపాలెం వద్ద ధోర్నపువాగుపై ఉన్న వంతెన కొట్టుకుపోయింది. దీంతో మండలంలోని పేరాయపాలెం,, దేనువకొండ, ఉమ్మనేనివారిపాలెంల నుంచి అద్దంకికి రాకపోకలు నిలిచిపోయాయి. తాళ్లూరు, వెల్లంపల్లి మీదుగా అద్దంకి చేరుకోవాల్సి వస్తోంది. అదే సమయంలో తాళ్లూరు, చీమకుర్తి, మద్దిపాడు మండలాలలోని పలు గ్రామాల నుంచి కూడా అద్దంకికి వచ్చే అవకాశం లేకుండా పోయింది. అద్దంకి నుంచి తాళ్లూరు, గంగవరం, బొద్దికూరపాడులకు నడిచే ఆర్టీసీ బస్సులను నిలిపి వేశారు. తాత్కాలిక మరమ్మతులు వెంటనే పూర్తి చేసి రాకపోకలు పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బంకమట్టితో మరమ్మతులు

● వాహనచోదకులకు ఇక్కట్లు

పంగులూరు: పంగులూరు ఇసుకవాగులో నేలచప్టాపై గుంటలు పూడ్చేందుకు ఉపయోగించిన బంకమట్టితో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మొంథా తుఫాన్ కారణంగా వరద తాకిడికి పంగులూరు నుంచి తక్కెళ్లపాడు వెళ్లే రోడ్డులోని నల్లవాగు చప్టాపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులను పూడ్చేందుకు బంకమట్టిని వినియోగించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొమర్నేనివారిపాలెం(పర్చూరు) : మొంథా తుఫాను ప్రభావంతో రోడ్లు దెబ్బతిని రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా, కాలువలు, వాగులకు గండ్లు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ఆయా మార్గాల నుంచి ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా అగచాట్లు పడాల్సిన పరిస్థితి. దీంతో గ్రామ పంచాయితీ, స్థానిక నేతల సారథ్యంలో ప్రత్యేక ఎక్సకవేటర్‌ను ఏర్పాటు చేసుకొని దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు శరవేగంగా సాగుతున్నాయి.





బల్లికురవ మండలం కొప్పెరపాడు వద్ద నిలిచిన వర్షపునీరు, పంగులూరు ఇసుకవాగులో నేలచప్టాపై గుంతలలో తేలిన బంకమట్టి, అద్దంకి మండలం నల్లవాగుపై ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జీ

పెత్తనం వద్దు...ప్రజా సేవే ముద్దు : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో సమస్యల్లో ఉన్న ప్రజలకు అండదండలు అందిద్దామని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శనివారం సీఎం చేతుల మీదుగా ఉత్తమసేవా పురస్కారం అందుకున్న ఎమ్మెల్యే ఆదివారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రశంసా పత్రాన్ని అందుకున్న ఎమ్మెల్యేకు పెద్ద సంఖ్యలో పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతోపాటు అధికారులు కూడా నిత్యం అందుబాటులో ఉండి సేవలందించినట్లు తెలిపారు. స్థానిక నేత సిద్ది బుచ్చేశ్వరరావు, మరి కొందరుకు పునరావాస కేంద్రాలలో ఆహారం, ఇతర వసతులు సమకూర్చడంతో సహకరించినట్లు తెలిపారు. అలాగే అధికారులను ఇబ్బందులకు గురి చేసిన కొన్ని ప్రాంతాలను గుర్తు చేశారు. ఒక్కో నేత నుంచి ఆయా గ్రామాలలో ప్రస్తుతం ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో పార్టీ జెండా ఎగిరేలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడియార స్తంభం ఏర్పాటుకు కృషి చేయండి

చీరాల : చారిత్రాత్మక కట్టడం గడియార స్తంభం పునఃనిర్మాణానికి కృషి చేయాలని సాధన సమితి ప్రతినిధులు ఎమ్మెల్యే కొండయ్యను కోరారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గడియార స్తంభం ప్రాధాన్యతను వివరించారు. చీరాల ప్రజల కల గడియార స్థంభం ఏర్పాటని, కూటమి ప్రభుత్వం హయాంలో నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు అక్కిశెట్టి పుల్లయ్యనాయుడు, సర్విశెట్టి సుబ్బరామయ్య, వడ్లమూడి ఆదినారాయణ, మెట్టా నరసయ్య, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, రాజు, పులి నారాయణ, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలను అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

చినగంజాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మున్నంవారిపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని మొంథా తుఫాన్ బాధితులకు టీడీపీ నాయకులు నిత్యావసర వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు బాధితులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు మున్నంవారిపాలెం టీడీపీ నాయకులు కుక్కల వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మున్నంవారిపాలెం పంచాయతీ పరిధిలోని రాజమాతకాలనీలోని తుఫాన్ కారణంగా వరద వచ్చి ఇల్లు మునిగిన బాధితులకు, కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని తుఫాన్ బాధితులకు 25 కేజీల బియ్యం, పంచదార 1 కేజీ, కందిపప్పు ఒక కేజీ, నూనె కేజీ, ఆలుగడ్డలు కేజీ, ఉల్లిపాయాలు ఒక కేజీ చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు కోకి శ్రీనివాసరెడ్డి, పొగర్త నాగరాజు, కత్తుల శ్రీను, పల్లపట్ల శ్రీనివాసరెడ్డి, ఎం.నాగాంజిరెడ్డి, రాజు ఉదయ్‌భాస్కరెడ్డి, చేజర్ల రమణ, పత్తిపాటి నాగేశ్వరరావు, తెడ్డు శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు


చికిత్స పొందుతున్న మధు, అన్నపూర్ణ

అద్దంకి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం ఢీ కొని భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు పట్టణంలోని భవానిసెంటర్‌కు చెందిన మధు, అపర్ణలు మున్సిపల్ కార్యాలయం సమీపంలో టిఫిన్ హోటల్ నిర్వహించుకుంటున్నారు. ఆదివారం ఉదయం ఇంటి వద్ద నుండి హోటల్ వద్దకు మోటార్‌సైకిల్ పై మున్సిపల్ కార్యాలయం రోడ్డులోకి పాతబస్టాండ్ వద్ద మలుపు తిరుగుతుండగా వెనుక నుండి వచ్చిన బొలేరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మధు, అపర్ణలకు గాయాలయ్యాయి. స్థానికుల వెంటనే క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

అద్దంకి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో పంటలు నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని శంఖవరప్పాడులో ఆయన ఆదివారం దెబ్బతిన్న మొక్క జొన్న పొలాలను పరిశీలించారు. వైసీపీ నేతలు జ్యోతి హనుమంతరావు, కాకాని రాధాకృష్ణమూర్తి, ఈదా శ్రీనివాసరెడ్డి, అవిశన ప్రభాకరరెడ్డి, మాకినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆక్రమణలో.. ఆనవాళ్లు

(5వ పేజీ తరువాయి)

ఉండేది. ఆలయ నిర్వహణలో పాలు పంచుకునే వారిని కశ్మీర్, తమిళనాడు నుంచి విశ్వేశ్వరశంభు ప్రత్యేకంగా తీసుకొచ్చారు. ఇలా శివాలయం అప్పట్లో ఒక వెలుగు వెలిగింది. ఇది నేడు గర్భాలయం వరకే పరిమితమై కనిపిస్తున్నది.

ఆక్రమణల మధ్య ఆనవాళ్లు మాయం..

కాకతీయుల అనంతరం జరిగిన ముస్లింల దాడుల నేపథ్యంలో గోళకీమఠం దెబ్బతింది. ఆలయ మండపాలతో పాటు గర్భగుడిలోని శివలింగాన్ని కూడా ధ్వంసం చేశారు. ఆ తర్వాత అగ్రహారంగా ఉన్న ఈ ప్రాంతమంతా కాలగతిలో ఆక్రమణల పాలైంది. ఆలయం, రుద్రమదేవి శిలాశాసనం కూడా కనిపించనంతగా గృహాలు పుట్టుకొచ్చాయి. ఆలయానికి దక్షిణంగా 20 సెంట్లు, పడమరగా 16 సెంట్లు మాత్రమే మిగిలి ఉంది. ఆలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేయాలని కోరుతూ గ్రామస్థులు ప్రభుత్వానికి అర్జీల రూపంలో విన్నవించుకున్నారు. డాక్టర్ భవానీ అనే డాక్టర్ ఇటీవల ఈ ఆలయ చరిత్రను తెలుసుకుని తన బంధుమిత్రుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణం చేస్తానని ముందుకొచ్చారు. అయితే ఆలయం చుట్టూవున్న 33 గృహాలవారు అందుకు అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో ఆమె ఏమీ చేయలేక నిస్సహాయిరాలిగా ఉండిపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2018లో ఈ ఆలయాన్ని సందర్శించారు. అయినా అభివృద్ధిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మందడం-తుళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంబడి ఉన్న రుద్రమదేవి నిర్మించిన చెరువు కూడా మూడువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి.

2011 నుంచే మళ్లీ పూజాదికాలు

గోళకీమఠం స్ఫూర్తితో విజయవాడకు చెందిన శివస్వామి మందడం శివారులోని కృష్ణానది వెంట తాళ్లాయపాలెంలో శైవక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. మల్కాపురంలో అరకొర గోడలతో సజీవశిలాజం మాదిరి మిగిలి ఉన్న గర్భగుడిలో 2011 చిన్న శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు జరిగేలా ఏర్పాటు చేశారు. ఇందుకు ఆలయం ఎదురుగా ఉన్న షేక్ అరుణ అనే మహిళ ఆర్థికసహకారాన్ని అందించారు. ములకల ఆదినారాయణ అనే పూజారి గత ఏడాదిగా స్వచ్ఛందంగా ఆలయంలో పూజాదికాలను నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల ఆచూకీ గుర్తింపు

● తహసీల్దార్ ఎదుట హాజరు పరిచిన సీఐ

అద్దంకి,అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): హాస్టల్ నుంచి పరారైన విద్యార్థులను పోలీసులు గుర్తించి డీటీ వద్ద ఆదివారం హాజరుపరిచారు. సీఐ సుబ్బరాజు కథనం మేరకు కాకానిపాలెం హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు శనివారం ఉదయం హాస్టల్ నుండి బయటకు వెళ్లారు. పాఠశాలకు వెళ్లకుండా పరారయ్యారు. సాయంత్రం సమయానికి కూడా విద్యార్థులు హాస్టల్‌కు రాకపోవడంతో వార్డెన్ వీరాస్వామి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ధనుష్, సుబ్బారెడ్డి మరో నలుగురు విద్యార్థులు శుక్రవారం రాత్రి బహిర్భూమికని బయటకు వెళ్లి హాస్టల్‌కు రావడం ఆలస్యం చేశారు. దీంతో సిబ్బంది వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఫోన్‌లో విద్యార్థులను తల్లిదండ్రులు మందలించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం పాఠశాలకని చెప్పి నేరుగా ఒంగోలు వెళ్లారు. అక్కడ నుండి ట్రైన్‌లో విజయవాడ వెళ్లి రాత్రి కి తిరిగి మరలా ఒంగోలు వచ్చారు. ఆదివారం ఉదయానికి మేదరమెట్ల చేరుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో 6 బృందాలు ఏర్పాటు చేసి అద్దంకి,ఒంగోలు, చిలకలూరిపేట,మార్టూరు,మేదరమెట్ల తదితర ప్రాంతాలలో వెతుకుతూ సీసీ పుటేజ్ పరిశీలించారు. ఈ క్రమంలో మేదరమెట్ల లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఇద్దరు విద్యార్థులు తీసుకొని వచ్చి ఆదివారం డీటీ సురేష్‌బాబు వద్ద హాజరుపరిచారు. అనంతరం తల్లిదండ్రులకు విద్యార్థులను అప్పగించారు. దీంతో ఇద్దరు విద్యార్థుల అదృశ్యం కథ సుఖాంతమైంది. ఆరుగురు విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకావడంతో గతంలో పలుమార్లు హాస్టల్ సిబ్బంది తల్లిదండ్రుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది.

డ్రోన్ ద్వారా వరద ప్రవాహం సర్వే



చినగంజాం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : చినగంజాం, పెదగంజాం ప్రాంతాల్లో వరద ప్రవాహన్ని, రొంపేరు, కొమ్మమూరు కాలువల్లో, పొలాలలను డ్రోన్‌ల ద్వారా ఆదివారం సర్వే చేసినట్లు మండల ప్రత్యేకాధికారి సీహెచ్. ప్రశాంత్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాలను డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కాలువల్లో ప్రవహించే వరదనీరుకు ఏమైనా అడ్డంకులు ఉన్నాయా..? అని చూసి త్వరగా వరద నీరు బయటకు పోయేందుకు సర్వే చేస్తున్నన్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఏవో ఆర్.చంద్రశేఖర్, మండల సర్వేయర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

చందుకు సేవారత్న అవార్డు


పృథ్వీ చేతులమీదగా అవార్డును అందుకుంటున్న చందు

మార్టూరు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): విశ్వజనని నరసరావుపేట వారు మార్టూరులో అమ్మ ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందును విశ్వ జనని సేవారత్నం అవార్డును బహూకరించారు. జ్ఞాపికను అందజేసి సత్కరించారు. తమఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి హైదరాబాదు నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా నిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సినీ నటులు పృథ్వీ చేతుల మీదగా చందుకు అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం, సినీ నటులు గౌతమ్, రాజు తదితర సినీ, రాజకీయనాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మేదరమెట్ల, నవంబరు2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ వద్ద ముందు వెళుతున్న మోపెడ్‌ను వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మోపెడ్‌పై వెళుతున్న దంపతులతో పాటు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. ఆదివారం ఎర్రబాలెం గ్రామానికి చెందిన మొరవినేని శేషగిరిరావు, ఆయన భార్య హైదరాబాద్ నుంచి బస్సు దిగారు. స్వగ్రామం ఎర్రబాలెంకు టీవీఎస్ మోపెడ్‌పై బయలుదేరారు. గ్రోత్‌సెంటర్ వద్ద యూటర్న్ తీసుకొని వెళుతున్న వీరి వాహనాన్ని ఒంగోలు వైపు నుంచి వస్తున్న మోటారు సైకిల్ ఢీకొన్నది. దీంతో భార్యాభర్తలు రోడ్డుపై పడి గాయపడ్డారు. ఒంగోలు వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఈశ్వర్ అనే వ్యక్తి కూడా గాయపడ్డారు. ఈశ్వర్ మద్యం సేవించి అతివేగంగా వాహనం నడపడంతో వేగం అదుపుకాక ముందు వెళుతున్న టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొన్నాడని పోలీసులు తెలిపారు. గాయపడిన వీరిని హైవే అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు.